## ఫ్లిప్‌కార్ట్‌లో కొనసాగుతున్న ఫిట్‌నెస్ కార్నివల్ సేల్

టెక్నాలజీ మన జీవితంలో అంతర్భాగంగా మారిన ఈ రోజుల్లో, ఆరోగ్యంపై శ్రద్ధ కూడా అదే స్థాయిలో పెరిగింది. మన ఫిట్‌నెస్‌ను, ఆరోగ్యాన్ని ఎప్పటికప్పుడు ట్రాక్ చేసుకునేందుకు స్మార్ట్‌వాచ్‌లు ఎంతగానో ఉపయోగ పడుతున్నాయి. అలాంటి వారి కోసమే ప్రముఖ ఈ-కామర్స్ దిగ్గజం ఫ్లిప్‌కార్ట్ 'ఫిట్‌నెస్ కార్నివాల్' పేరుతో ప్రత్యేక సేల్‌ను నిర్వహిస్తోంది. నవంబర్ 14న ప్రారంభమైన ఈ సేల్, నేటితో ముగియనుంది. ఈ సేల్‌లో భాగంగా ఆపిల్, సామ్‌సంగ్, గార్మిన్ వంటి టాప్ బ్రాండ్ల స్మార్ట్‌వాచ్‌లపై కనీవినీ ఎరుగని డిస్కౌంట్లను అందిస్తోంది. ఈ ఆఫర్లకు అదనంగా ఎంపిక చేసిన బ్యాంక్ కార్డులపై ప్రత్యేక తగ్గింపులు, 9 నెలల వరకు నో-కాస్ట్ ఈఎంఐ సౌకర్యం



www.epaper.asthram.com

# సామాన్యుడి అస్త్రం

తెలుగు దినపత్రిక

మంగళవారం 18 నవంబర్ 2025

సంగారెడ్డి సంచిక : 81 సంపుటి : 1 పేజీలు : 8 వెల : రూ. 5/-





## ఢిల్లీలో అలా చేయడం కుదరదు

- కాలుష్య నియంత్రణకోసం నిర్మాణం రంగాన్ని పూర్తిగా నిలిపివేయడం సరైన చర్యకాదు
- ఢిల్లీతో పాటు ఆ నగర పరిసర ప్రాంతాలలో నిర్మాణాలు, ఇతర కట్టడాలపై విధించిన నిషేదాన్ని సుప్రీంకోర్టు తిరస్కరించింది
- పర్యావరణ పరిరక్షణ అనేది అభివృద్ధిని అడ్డుకోకుండా ఉండాలి
- సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ బీఆర్ గవాయ్

## ఆ ఆపరేషన్ కేవలం 88 గంటల ట్రైలర్ మాత్రమే

- పాక్‌కు మరోసారి స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చిన ఆర్మీ చీఫ్
- దాయాది ఏదైనా దుశ్చర్యలకు పాల్పడితే గట్టి గుణపాఠం చెప్పేందుకు భారత సైన్యం సిద్ధంగా ఉంది
- ఆపరేషన్ సిందూర్ కేవలం 88 గంటల ట్రైలర్ మాత్రమే
- పాక్ అవకాశం ఇస్తే.. పొరుగుదేశంతో బాధ్యతాయుతంగా ఎలా ప్రవర్తించాలో దాయాదికి మేము నేర్పిస్తాము'





## భారీ విధ్వంసానికి కుట్ర!

- ఢిల్లీ కారు బాంబు కేసు దర్యాప్తులో కీలక విషయాలు..!
- కశ్మీరీ ఆత్మాహుతి బాంబర్ డాక్టర్ ఉమర్ నబీ సహ కుట్రదారుడు అమీర్ రషీద్ అలీ కీలక విషయాలు వెల్లడి
- ఆత్మాహుతి బాంబర్ కోసం అన్వేషన జైష్ ఏ మహ్మద్‌తో ముడిపడి ఉన్న అంతర్రాష్ట్ర ఉగ్రవాద నెట్‌వర్క్‌పై దర్యాప్తులో ప్రమాదకరమైన కొత్త కోణం వెలుగులోకి వచ్చినట్లయ్యింది.

# తొలుత పంచాయతీ



**మార్చిలోగా ఎన్నికలు నిర్వహించకపోతే.. రూ.3 వేల కోట్ల కేంద్ర నిధులు మురిగిపోయే ప్రమాదం**

**పార్టీపరంగా బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తాం**




- కోర్టుల తీర్పులు వచ్చాకే మిగతా స్థానిక సంస్థల ఎన్నికలు
- 8, 9 తేదీల్లో తెలంగాణ రైజింగ్-2047 గ్లోబల్ సమిట్
- 9న తెలంగాణ దార్శనిక పత్రం విడుదల
- అందెశ్రీ కుమారుడికి అసిస్టెంట్ ప్రొఫెసర్ ఉద్యోగం
- క్యాబినెట్ సమావేశంలో కీలక నిర్ణయాలు
- వెల్లడించిన మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

హైదరాబాద్

పార్టీపరంగా బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించి.. గ్రామపంచాయతీ ఎన్నికలు నిర్వహించాలని రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయించింది. పంచాయతీలకు వచ్చే ఏడాది మార్చి ఆఖరులోగా ఎన్నికలు నిర్వహించకపోతే.. 15వ ఆర్థిక సంఘం నుంచి రావాల్సిన రూ.3 వేల కోట్లు నిలిచిపోయే ప్రమాదమున్నందువల్ల... ఈ నిర్ణయం తీసుకున్నట్లు రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధ్యక్షతన సోమవారం రాష్ట్ర మంత్రివర్గం సమావేశమైంది. ఇందులో తీసుకున్న నిర్ణయాలను మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీలతో కలిసి - మిగతా 2లో

# సౌదీలో మృత్యు ఘోష

- మరో ఇద్దరు కర్ణాటకవాసుల మృత్యువాత... మక్కాను సందర్శించుకుని మదీనా వెళ్తుండగా దుర్ఘటన
- మృతుల్లో ఒకే కుటుంబానికి చెందిన 18 మంది.. ఈ నెల 9న నగరం నుంచి వెళ్లిన 54 మంది
- బస్సులో మదీనాకు బయలుదేరిన 46 మంది.. ఒక్కరు మినహా మిగతా వారంతా మృత్యువాత.. ఘోర ప్రమాదంతో హైదరాబాద్‌లో విషాదం..




న్యూఢిల్లీ/న్యూఢిల్లీ:

సౌదీ అరేబియాలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. మక్కా, మదీనా సందర్శించుకోవాలనే తమ చిరకాల వాంఛను తీర్చుకునేందుకు హైదరాబాద్ నుంచి వెళ్లిన 45 మంది ఉమ్రా యాత్రికులు దుర్మరణం పాలయ్యారు. వీరిలో 43 మంది నగరానికే చెందిన వారు కాగా, మరో ఇద్దరు కర్ణాటకకు చెందినవారు. వీరు ప్రయాణిస్తున్న బస్సును ఆయిల్ ట్యాంకర్ ఢీకొట్టగా మంటలు చెలరేగడంతో అంతా సజీవ దహనమయ్యారు. మక్కా నుంచి మదీనా వెళ్తుండగా సోమవారం తెల్లవారుజామున మదీనాకు సమీపంలో ఈ దుర్ఘటన జరిగింది. ఉదయాన్నే అందిన పిడుగుపాటు లాంటి వార్త నగర వాసుల్ని కలచివేసింది. ఈ ప్రమాదంలో తల్లిదండ్రులు, వారి కుమారులు, కుమార్తెలు, వారి పిల్లలు సహా ఒకే కుటుంబానికి చెందిన 18 మంది మృతి చెందడం తీవ్ర విషాదాన్ని నింపింది. - మిగతా 2లో

సౌదీ బస్సు ప్రమాద మృతుల కుటుంబాలకు

## రూ. 5 లక్షల పరిహారం

- సౌదీకి అజారుద్దీన్ బృందం
- మక్కా నుంచి మదీనాకు ప్రయాణిస్తున్న బస్సు ప్రమాదంలో 45 మంది మృతి
- మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపిన మంత్రివర్గం
- అంత్యక్రియల కోసం ఒక్కో కుటుంబం నుంచి ఇద్దరిని సౌదీకి పంపించాలని నిర్ణయం



## ఎమ్మెల్యేల ఫిరాయింపు.. స్పీకర్‌పై సుప్రీంకోర్టు ఆగ్రహం

- నాలుగు వారాల్లోగా జవాబు చెప్పాలని ఆదేశించింది
- 2023 డిసెంబరులో తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల తరువాత బీఆర్ఎస్ తరఫున గెలిచిన కొంతమంది ఎమ్మెల్యేలు అధికార కాంగ్రెస్ పక్షంవైపు మళ్లడం తెలిసిందే.

ఢిల్లీ

తెలంగాణ స్పీకర్‌పై సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలపై నిర్ణయం తీసుకోకపోవడాన్ని ఆక్షేపించింది. అంతేకాదు.. కోర్టు ధిక్కరణ నోటీసులు జారీ చేసింది. నాలుగు వారాల్లోగా జవాబు చెప్పాలని ఆదేశించింది. 2023 డిసెంబరులో తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల తరువాత బీఆర్ఎస్ తరఫున గెలిచిన కొంతమంది ఎమ్మెల్యేలు అధికార కాంగ్రెస్ పక్షంవైపు మళ్లడం తెలిసిందే. పార్టీ ఫిరాయించిన వారిలో దానం నాగేందర్, కడియం శ్రీహరి, తెల్లం వెంకటరావు, అరెకపూడి గాంధీ, పోచారం శ్రీనివాస్ రెడ్డి, సంజయ్ కుమార్, ప్రకాశ్ గౌడ్, కాలే యదయ్య, గూడెం మహిపాల్ రెడ్డి, బండ్ల కృష్ణమోహన్ రెడ్డి ఉన్నారు. వీరిపై వేటు వేయాలని కోరుతూ బీఆర్ఎస్ స్పీకర్‌ను కోరింది.

# ఇండియా కూటమి సారథిగా అఖిలేష్ యాదవ్!?

ప్రతిపక్ష ఇండియా కూటమికి వరుస ఎన్నికల్లో ఓటములతో ఎదురు దెబ్బలు తప్పడం లేదు. ఈ తరుణంలో నాయకత్వ మార్పు అంశం మరోసారి చర్చనీయాంశమైంది. కాంగ్రెస్ ఆ బాధ్యతల నుంచి తప్పుకోవాల్సిందేననే ప్రత్యక్షంగా.. పరోక్షంగా పలువురు అంటున్నారు. ఎస్పీ అధినేత, ఎంపీ అఖిలేష్ యాదవ్ ఇండియా కూటమి సారథ్య బాధ్యతలు చేపట్టాలనే డిమాండ్ తెర మీదకు వచ్చింది. 2023 జులై 17వ తేదీన బెంగళూరులో జరిగిన సమావేశంలో 26 పార్టీలు ఇండియ కూటమి ఏర్పాటు ప్రకటన చేశాయి. అప్పటి నుంచి కాంగ్రెస్ సారథ్యంలోనే ఈ కూటమి ముందుకు నడుస్తోంది. అయితే.. బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఘోర పరాజయం పాలవడంతో.. నాయకత్వ మార్పు గురించి చర్చలు మొదలయ్యాయి. సమాజ్‌వాది పార్టీకి చెందిన ఒక ఎమ్మెల్యే తాజాగా.. ఆ పార్టీ అధినేత, కన్నౌజ్ ఎంపీ అయిన అఖిలేశ్ యాదవ్ ప్రతిపక్ష కూటమిని నడిపించాలని కోరారు. అంతేకాదు దేశ రాజకీయాల్లో అత్యంత రాజకీయ ప్రాధాన్యం కలిగిన సమాజ్‌వాదికి.. యూపీలో సొంతంగా ప్రభుత్వం ఏర్పాటు చేసే సామర్థ్యం ఉందని కూడా వ్యాఖ్యానించారు.



గత సంవత్సరం జరిగిన లోక్‌సభ సాధారణ ఎన్నికల్లో 37 స్థానాలు గెలుచుకున్న సమాజ్‌వాది పార్టీ.. లోక్‌సభలో కాంగ్రెస్ తర్వాత రెండవ అతిపెద్ద ప్రతిపక్ష పార్టీగా ఉంది. బిహార్ ఫలితంపై లక్నో సెంట్రల్ ఎమ్మెల్యే రవీదాస్ మాట్లాడుతూ.. ఎన్నికలు బ్యాలెట్ పద్ధతిలో జరిగి ఉంటే ఇండియా కూటమే ప్రభుత్వం ఏర్పాటు చేసేదన్నారు. "ఈవీఎంల పని తీరును మా అధినేత అఖిలేష్ యాదవ్ మొదటి నుంచి ప్రశ్నిస్తూనే ఉన్నారు. బ్యాలెట్ పద్ధతిలో ఎన్నికలు జరగాలని.. ఆ విధానాన్ని తిరిగి ప్రవేశపెట్టాలని కోరుతున్నారు కూడా. ఇందుకోసమైనా ఇండియా కూటమికి సమాజ్‌వాది పార్టీ అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్ నాయకత్వం వహించాలి. ఉత్తరప్రదేశ్‌లో సమాజ్‌వాది పార్టీ స్వయంగా ప్రభుత్వం ఏర్పాటు చేసే సామర్థ్యం కలిగి ఉందనే విషయం గుర్తించాలి" అని అన్నారు.

గత సంవత్సరం లోక్‌సభ ఎన్నికల్లో 99 స్థానాలు గెలుచుకున్న ప్రధాన ప్రతిపక్షం.. ఆ తర్వాత జరిగిన వరుస రాష్ట్ర ఎన్నికల్లో ఘోరమైన ఫలితాల్ని ఇస్తోంది. గత ఏడాది కాలంలో.. ఎనిమిది అసెంబ్లీ ఎన్నికలు జరగ్గా ఆరింటిలోబీజేపీ, దాని మిత్రపక్షాలు విజయం సాధించాయి, అందులో హర్యానా, మహారాష్ట్ర వంటి కీలక రాష్ట్రాలు కూడా ఉన్నాయి. ఇండియా కూటమిలో నాయకత్వ చర్చ కొత్తదేం కాదు. ఎన్నికల్లో ఫ్లాఫ్ షో ప్రదర్శించినప్పుడల్లా ఇది చర్చకు వస్తూనే ఉంది. గతంలో తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి, పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీకి ఆ పగ్గాలు అప్పగించాలనే డిమాండ్ బలంగా వినిపించింది. ఇండియా కూటమికి స్పష్టమైన నాయకత్వం లేదు. కాంగ్రెస్ ఆ బాధ్యతల్లో విఫలమవుతూ వస్తోంది. కాబట్టి.. స్పష్టమైన ఎన్నిక జరగాలి అని టీఎంసీ నేత కల్యాణ్ బెనర్జీ గతంలో అన్నారు. కాంగ్రెస్‌పై తాము విశ్వాసం ఉంచామని.. కానీ ఈ విషయంలో ఆ పార్టీ ఘోరంగా విఫలమవుతోందంటూ మహారాష్ట్ర, హర్యానా ఎన్నికల ఫలితాలపై ఆయన పై వ్యాఖ్య చేశారు. ఆసక్తికరమైన విషయం ఏంటంటే..

ఆర్జేడీ చీఫ్ లాలూ ప్రసాద్ యాదవ్ కూడా ఇండియా కూటమి నాయకత్వం మార్పు అవసరమని గతంలో సూచించారు. మమతా బెనర్జీకి ఆ బాధ్యతలు అప్పగించాలని కోరారు. ప్రతిపక్ష హోదాలో కాంగ్రెస్సే ఉంటుంది. అందులో ఎలాంటి తేడా ఉండబోదు కదా. అలాంటప్పుడు ఆమెకు(మమతా బెనర్జీని ఉద్దేశించి) ఇండియా కూటమికి నాయకత్వం వహించే అవకాశం ఇవ్వాలి అని లాలూ అప్పట్లో అన్నారు.

# భారీ విధ్వంసానికి కుట్ర!

ఢిల్లీ ఎర్రకోట వద్ద జరిగిన కారు బాంబు పేలుడుపై జాతీయ దర్యాప్తు సంస్థ దర్యాప్తులో కీలక విషయాలు వెల్లడయ్యాయి. కశ్మీరీ ఆత్మాహుతి బాంబర్ డాక్టర్ ఉమర్ నబీ సహ కుట్రదారుడు అమీర్ రషీద్ అలీ కీలక విషయాలు వెల్లడించాడు. అంతేకాకుండా డాక్టర్ ఆదిల్ రాథర్, డాక్టర్ ముజఫర్ గనైతో సహా ఇతర నిందితుల విచారణ ఆధారంగా శ్రీనగర్ పోలీసులు పొలిటికల్ సైన్స్ గ్రాడ్యుయేట్ డానిష్‌ను అరెస్ట్ చేశారు. డాక్టర్ ఉమర్ పేలుడు పదార్థాలు ఉన్న వాహనాన్ని ఢిల్లీలోని రద్దీగా ఉండే ప్రదేశంలో, ఆధ్యాత్మిక ప్రదేశాల్లో వదిలిపెట్టి వెళ్లాలని కుట్ర పన్నినట్లుగా అధికారులు తెలిపారు. ఆత్మాహుతి బాంబర్ కోసం అన్వేషన జైష్ ఏ మహ్మద్‌తో ముడిపడి ఉన్న అంతర్రాష్ట్ర ఉగ్రవాద నెట్‌వర్క్‌పై దర్యాప్తులో ప్రమాదకరమైన కొత్త కోణం వెలుగులోకి వచ్చినట్లయ్యింది.



డానిష్ విచారణ ఆధారంగా 2021లో టర్కీకి వెళ్లిన డాక్టర్ ముజమ్మిల్ అహ్మద్ ఘనీ వైట్‌కాలర్ టెర్రరిస్ట్ మాడ్యూల్ సభ్యుడు డాక్టర్ ముజమ్మిల్ అహ్మద్ ఘనీతో కలిసి డాక్టర్ ఉమర్ తీవ్రవాదం వైపు వెళ్లాడని.. అక్కడ జైష్ ఏ మహ్మద్ భూగర్భ గ్రౌండ్ కార్యకర్తను కలిశాడు. ఈ అనుమానితుల ప్రొఫైల్ 20 సంవత్సరాల కిందట నియమించబడిన ఉగ్రవాదుల ప్రొఫైల్ నుంచి భిన్నంగా ఉంటుంది. 2000 సంవత్సరాల ప్రారంభం నుంచి 2020 వరకు ఉగ్రవాద సంస్థలు ఇప్పటికే ఉగ్రవాద కార్యకలాపాల్లో పాల్గొన్న యువతపై దృష్టి సారించాయి. జైళ్లలో పెద్ద సంఖ్యలో యువత పెద్ద సంఖ్యలో యువత తీవ్రవాదానికి గురయ్యారు. ఎర్రకోట సమీపంలో జరిగిన కారు బాంబు దాడిలో డాక్టర్ ఒమర్ నబీ 30 నుంచి 40 కిలోగ్రాముల పేలుడు పదార్థాలను ఉపయోగించారు. ఇప్పటివరకు జరిగిన దర్యాప్తులో పేలుడులో అమ్మోనియం నైట్రేట్ ఉపయోగించినట్లు నిర్ధారించారు. పేలుడును మరింత శక్తివంతం చేయడానికి అమ్మోనియం నైట్రేట్‌తో పాటు ఇతర పేలుడు పదార్థాలను ఉపయోగించారని అనుమానిస్తున్నారు. అమ్మోనియం నైట్రేట్‌తో ఏ రసాయనాలను ఉపయోగించారో తెలుసుకోవడానికి దర్యాప్తు కొనసాగుతోంది. కారు వెనుక భాగంలో పేలుడు పదార్థాలు నిల్వ చేసినట్లు అనుమానిస్తున్నారు. డాక్టర్ ఒమర్ నబీ కారు హుడ్‌కు డిటోనేటర్‌ను అమర్చి, కారు వెనుక భాగంలో నిల్వ చేసిన పేలుడు పదార్థాలను పేల్చడానికి దాన్ని ఉపయోగించారని ప్రాథమిక దర్యాప్తులో తేలింది.

రెండు రోజుల కిందట పార్కింగ్ స్థలంలో 3.29 గంటల పాటు ఉమర్ బస చేసిన సమయంలో పేలుడు పదార్థాలను తయారు చేసి ఉండవచ్చని అనుమానిస్తున్నారు. ఒంటరిగా పేలుడు పదార్థాలను తయారు చేశాడా? మరెవరైనా సహాయం అందించారా? అన్న విషయం తెలుసుకునేందుకు ప్రయత్నిస్తున్నాయి. ఇందు కోసం దర్యాప్తు సంస్థలు మొత్తం ప్రాంతం నుంచి డంప్ డేటాను సేకరించాయి. దర్యాప్తు సంస్థలు సంఘటన స్థలం నుంచి 40కిపైగా నమూనాలను సేకరించాయి. డిటోనేటర్ హుడ్ కింద ఉన్న బ్యాటరీకి అనుసంధానించినట్లుగా అనుమానిస్తున్నారు. సంఘటనా స్థలం నుంచి పలు సన్నని వైర్లను సైతం స్వాధీనం చేసుకున్నారు. ఢిల్లీ ఎన్‌సీఆర్, హర్యానాలోని దాదాపు 5వేల సీసీటీవీ కెమెరాల సహాయంతో దర్యాప్తులు పేలుడు తర్వాత దాదాపు 500 నుంచి 600 మీటర్ల వ్యాసార్థంలో ఐ-20 కారు ముక్కలను స్వాధీనం చేసుకున్నాయి. ఏ రకమైన పేలుడు పదార్థం కారును చిన్న ముక్కలుగా విరిచిందో తెలుసుకోవడానికి వారి ఫోరెన్సిక్ దర్యాప్తు జరుగుతోంది. ఢిల్లీ, హర్యానా, జమ్మూ కశ్మీర్, యూపీలోని వివిధ ప్రాంతాలలో దర్యాప్తు బృందాలు నిరంతరం దాడులు జరుపుతున్నాయి. ఎర్రకోట సమీపంలో జరిగిన పేలుడులో మరణించిన ఆటో డ్రైవర్ బిలాల్ అహ్మద్ పోస్టుమార్టం ఇంకా పెండింగ్‌లోనే ఉంది. జమ్మూ కశ్మీర్‌లోని గందర్బాల్‌లో నివసించే బిలాల్ కుటుంబం ఎస్ఎస్‌పీ ద్వారా ఢిల్లీ పోలసులను సంప్రదించి.. ఆదివారం ఢిల్లీకి వస్తామని చెప్పింది. అయితే, సమాచారం ఇచ్చినా కుటుంబం ఇంకా ఢిల్లీకి రాలేదని పోలీసులు వర్గాలు చెబుతున్నాయి. దాంతో బిలాల్ మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించలేదని తెలిపాయి. ఈ-రిక్షా డ్రైవర్ అయిన బిలాల్ వస్తువులను వదిలి ఎర్రకోటకు తిరిగి వస్తుండగా పేలుడులో గాయపడ్డాడు. చికిత్స పొందుతూ గురువారం మరణించాడు. అదే సమయంలో ఆత్మాహుతి బాంబర్ దాడి చేసిన డాక్టర్ ఒమర్ నబీ మృతదేహంలోని పలు ముక్కలు మార్చురీకి తరలించారు. మృతదేహాన్ని డీఎన్ఏ ద్వారా గుర్తించారు. కానీ ఇంకా ఎవరూ ఇంకా మృతదేహాన్ని తీసుకువెళ్లేందుకు ముందుకు రాలేదు. అయితే, భద్రతా బలగాలు అతని కుటుంబాన్ని ప్రశ్నిస్తున్నాయి. సంఘటన జరిగిన ప్రదేశం నుంచి 150 మీటర్ల దూరంలో ఉన్న గౌరీ శంకర్ ఆలయం సమీపంలోని టాయిలెట్ పైకప్పుపై మనిషి చెయ్యి దొరికింది. ఇది బాంబర్ ఉమర్‌దిగా భావిస్తున్నారు. ఆ చేయిని కూడా కూడా శరీర భాగాలతో పాటు మార్చ్యురీలో ఉంచారు.


# శబరిమలలో భారీ వర్షాలు.. అయ్యప్ప భక్తులకు అలర్ట్!

**తిరువనంతపురం:** శబరిమలలో ఇవాళ, రేపు భారీ వర్షం కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ పేర్కొంది. కొట్టాయం, ఇడుక్కి, అలప్పుజా, పతనం తిట్ట, కొల్లాం, తిరువనంతపురం జిల్లాలో భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ ప్రకటించింది. ఈ నేపథ్యంలో వాతావరణ శాఖ శబరిమల యాత్ర ప్రాంతంతో సహా మొత్తం ఆరు ఇతర జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ ప్రకటించింది. నైరుతి బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావమే ఈ భారీ వర్షాలకి కారణం అని వాతావరణ శాఖ తెలిపింది. అందువల్ల ఈ రోజు, రేపు శబరిమల సన్నిధానం, పంప, నీలక్కల్ తదితర ప్రాంతాల్లో ఉరుములతో కూడిన భారీ వర్షం పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ వెల్లడించింది.

ఆయా ప్రాంతల్లో తప్పనిసరిగా..

సన్నిధానం, పంబా, నీలక్కల్‌లలో ఇవాళ, రేపు 7 సెం.మీ నుంచి 11 సెం.మీ వరకు వర్షం పడే అవకాశం ఉంది

అలర్ట్ జారీ చేయబడిన జిల్లాల్లో 24 గంటల్లో 64.5 మిమీ నుంచి 115.5 మిమీ వరకు భారీ వర్షం కురిసే అవకాశం ఉంది.



అయ్యప్ప భక్తులకు భద్రతా సూచనలు

భారీ వర్ష హెచ్చరిక నేపథ్యంలో రాష్ట్ర విపత్తు నిర్వహణ అథారిటీ యాత్రికులకు ప్రత్యేక హెచ్చరిక సూచనలు జారీ చేసింది. కొండచరియలు విరిగిపడటం, బురదజల్లులు, పర్వత వరదలకు గురయ్యే ప్రాంతాలలో నివసించేవారు, అలాగే నదుల వెంబడి, ఆనకట్టల దిగువన నివసించేవారు అధికారుల సూచనల మేరకు వెంటనే సురక్షిత ప్రదేశాలకు తరలివెళ్లాలని విపత్తు నిర్వహణ అథారిటీ సూచించింది.

**ప్రయాణ ప్యాకేజీలు టూర్లు**

విపత్తు సంభవించే ప్రాంతాల్లో నివసించేవారు పగటిపూట సమీపంలోని సహాయ శిబిరాలకు తరలి వెళ్లాలి. వాటి సమాచారం కోసం ప్రజలు స్థానిక స్వపరిపాలన, రెవెన్యూ అధికారులను సంప్రదించవచ్చు.

బలమైన గాలులు వీచే అవకాశం ఉన్నందున, భద్రత లేని ఇళ్లు లేదా బలహీనమైన పైకప్పులు ఉన్న ఇళ్లలో నివసించేవారు చాలా జాగ్రత్తగా ఉండాలి.

వర్షపు రోజుల్లో అనవసరమైన ప్రయాణాలు, పర్వతారోహణను నివారించాలి.

శబరిమల దర్శనానికి వచ్చే భక్తులు వాతావరణ సమాచారాన్ని ఎప్పటికప్పుడు తెలుసుకోవాలి. అలాగే భద్రతాధికారుల సూచనల మేరకు ప్రయాణాన్ని కొనసాగించాల్సి ఉందన స్పష్టం చేసింది కేరళ రాష్ట్ర విపత్తు నిర్వహణ అథారిటీ.

## ఢిల్లీలో అలా చేయడం కుదరదు



ఢిల్లీ గాలి నాణ్యత కోసం కేంద్రం తీసుకున్న చర్యలను సుప్రీంకోర్టు ప్రశ్నించింది. కాలుష్య నియంత్రణకోసం నిర్మాణం రంగాన్ని పూర్తిగా నిలిపివేయడం సరైన చర్యకాదని తెలిపింది. ఢిల్లీతో పాటు ఆ నగర పరిసర ప్రాంతాలలో నిర్మాణాలు, ఇతర కట్టడాలపై విధించిన నిషేదాన్ని సుప్రీంకోర్టు తిరస్కరించింది తాము పర్యావరణ నిపుణులు కామని, అయితే పర్యావరణ పరిరక్షణ అనేది అభివృద్ధిని అడ్డుకోకుండా ఉండాలని సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ బీఆర్ గవాయ్ తెలిపారు. గాలి కాలుష్యాన్ని అడ్డుకోవడానికి తీవ్రమైన నిర్ణయాలు తీసుకోవడం సరికాదన్నారు. నిర్మాణ రంగంపై లక్షలాది కుటుంబాలు ఆధారపడి ఉన్నాయని దానిని పూర్తిగా నియంత్రిస్తే అది వారి కుటుంబాలపై ప్రభావం చూపిస్తుందని అది తీవ్రమైన సామాజిక ఆర్థిక పరిస్థితికి దారితీస్తుందని తెలిపారు. పర్యావరణ రక్షించడానికి నవంబర్ 19లోగా ఒక ప్రణాళికతో ముందుకు రావాలని జస్టిస్ బీఆర్ గవాయ్ కేంద్రానికి ఆదేశాలు జారీ చేశారు. ఢిల్లీ పర్యావరణాన్ని రక్షించే బాధ్యత కేంద్రానిదేనని స్థానిక ప్రభుత్వానిది కాదని తెలిపారు. అదే విధంగా కేంద్ర కాలుష్య నియంత్రణ బోర్డు, గాలి నిర్వహణ కమిషన్ ఢిల్లీలోని ప్రస్తుత వాయు కాలుష్య పరిస్థితులను వివరించాలని ఆదేశించారు. దేశ రాజధాని ఢిల్లీలో గాలి నాణ్యత పూర్తిగా క్షీణించడంతో ఢిల్లీతో పాటు పరిసర ప్రాంతాలలో నిర్మాణాలు చేపట్టడం, కూల్చివేయడాన్ని నిషేదిస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఈ నేపథ్యంలో కోర్టు దానిని తిరస్కరించింది.

## ఆ ఆపరేషన్ కేవలం 88 గంటల ట్రైలర్ మాత్రమే



దాయాది పాకిస్థాన్‌కు భారత ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది మరోసారి స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చారు. ఈ ఏడాది మేలో నిర్వహించిన ఆపరేషన్ సిందూర్ కేవలం 88 గంటల ట్రైలర్ మాత్రమేనని అన్నారు. దాయాది ఏదైనా దుశ్చర్యలకు పాల్పడితే గట్టి గుణపాఠం చెప్పేందుకు భారత సైన్యం సిద్ధంగా ఉందని ఆయన తీవ్ర స్వరంతో హెచ్చరికలు జారీ చేశారు. ఢిల్లీలో జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న ఉపేంద్ర ద్వివేది ఈ సందర్భంగా మాట్లాడారు. 'ఆపరేషన్ సిందూర్ 88 గంటల్లో ముగిసిన ట్రైలర్ మాత్రమే. భవిష్యత్తులో ఎలాంటి పరిస్థితులకైనా మేం సిద్ధంగా ఉన్నాం. పాక్ అవకాశం ఇస్తే.. పొరుగుదేశంతో బాధ్యతాయుతంగా ఎలా ప్రవర్తించాలో దాయాదికి మేము నేర్పిస్తాము' అని వ్యాఖ్యానించారు. పాకిస్థాన్‌తో వ్యవహరించే విషయంలో భారత ప్రభుత్వం కొత్త విధానాలను అనుసరిస్తున్నట్లు తెలిపారు. భారత ప్రభుత్వం ఎప్పుడూ దేశ ప్రజల శ్రేయస్సు, పురోగతిపై దృష్టి పెడుతుందని జనరల్ ద్వివేది తెలిపారు. తన మార్గంలో ఎవరైనా అడ్డంకులు సృష్టిస్తే.. దీటుగా స్పందిస్తుందని స్పష్టం చేశారు. ఉగ్రవాదులకు మద్దతిచ్చే దేశాలతో చర్చలు ఉండవని తేల్చి చెప్పారు. ఉగ్రవాద గ్రూపులకు మద్దతిస్తూ తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని దాయాది పాక్‌కు జనరల్ ఉపేంద్ర ద్వివేది గట్టిగా హెచ్చరించారు.

## బిహార్‌లో విజయంతో
## ఆ రాష్ట్రంలో క్యాబినెట్‌పై బీజేపీ ఫోకస్.!

బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే కూటమి బిహార్‌లో విజయం సాధించాక.. మధ్యప్రదేశ్‌లో రాజకీయం వేడెక్కుతోంది. డాక్టర్ మోహన్ యాదవ్ ప్రభుత్వంలో త్వరలోనే అక్కడ ప్రధాన మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ దిశగా బలమైన సంకేతాలు కనిపిస్తున్నాయి. గతంలో మంత్రి పదవులు నిర్వహించిన ఇద్దరు బీజేపీ ఎమ్మెల్యేలకు క్యాబినెట్‌లో మరలా స్థానం కల్పించాలనే ప్రచారం జోరందుకుంది. ఈ ఏడాది డిసెంబర్ నాటికి మోహన్ యాదవ్ ప్రభుత్వం రెండేళ్లు పూర్తి కానున్న తరుణంలో మంత్రిమండలిలో కొత్త ముఖాలకు చోటు కల్పించే దిశగా ప్రభుత్వం దృష్టి సారిస్తున్నట్టు తెలుస్తోంది. మధ్యప్రదేశ్‌లో 31 మంది సభ్యుల మంత్రివర్గంలో ప్రస్తుతం 4 పదవులు ఖాళీగా ఉన్నాయి. దీంతో ఈ ఊహాగానాలకు ఆజ్యం పోసినట్లైంది. ఆ తర్వాత జరిగే మంత్రివర్గ విస్తరణ లేదా పునర్వ్యవస్థీకరణ ద్వారా ప్రాంతీయ సమతుల్యతను పరిష్కరించడంతో పాటు 2028 అసెంబ్లీ ఎన్నికలకు ముందు ప్రభుత్వాన్ని బలోపేతం చేసే దిశగా ముందడుగు పడే అవకాశముంది. కేవలం మంత్రులకే కాకుండా.. ఎమ్మెల్యేలనూ తమ నియోజకవర్గాలకు సంబంధించిన నాలుగేళ్ల అభివృద్ధికి సంబంధించిన రోడ్‌మ్యాప్‌ను సిద్ధం చేయాలని ప్రభుత్వం కోరింది. ఎమ్మెల్యేల నిధుల వినియోగం, సంక్షేమ పథకాల అమలు, స్థానిక సమస్యలను పరిష్కరించడంలో వారి భాగస్వామ్యం వంటి అంశాలను పరిగణలోకి తీసుకోనున్నారు. సదరు నివేదికలను ముఖ్యమంత్రికి సమర్పించనున్నారు. ఈ సమీక్షంతా అక్కడి క్యాబినెట్ సర్దుబాటుకోసమేనన్న సూచనలు కనిపిస్తున్నాయి. రాష్ట్రంలో మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణపై ఓ మీడియా సంస్థ సీఎంను ప్రశ్నించగా.. 'మాది అఖిల భారత పార్టీ. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా, పార్టీ జాతీయ అధ్యక్షుడు జేపీ.నడ్డా నాయకత్వంలో మేం పనిచేస్తున్నాం. రాష్ట్రంలో రెండేళ్ల పాలన తర్వాత సమీక్ష సహజం. పార్టీ ఏది నిర్ణయించినా.. మేం దానికి కట్టుబడి ఉంటాం. ఇలాంటి అవకాశాలు జీవితంలో చాలా అరుదుగా వస్తుంటాయి. ఎలాంటి బాధ్యతలు అప్పగించినా మనం వాటిని సక్రమంగా నిర్వర్తించాలి.' అని సమాధానిచ్చారు. సీఎం ఈ రకంగా స్పందించడంతో.. భోపాల్‌లో రాజకీయం మరింత వేడెక్కింది. అయితే.. అధికారిక వర్గాల సమాచారం ప్రకారం.. మధ్యప్రదేశ్‌లోనూ 'గుజరాత్ ఫార్ములా'ను అమలు చేసేందుకు బీజేపీ ప్రయత్నిస్తోంది. ఇదే నిజమైతే అనేక మంది సీనియర్ ఎమ్మెల్యేలకు మంత్రివర్గంలో చోటు లభిస్తుంది. ఇప్పటికే ఉన్న కొందరు మంత్రుల శాఖలూ మారవచ్చు. అంతేకాకుండా పార్టీ నూతన జాతీయ అధ్యక్షుడి నియామకం కూడా ఇందులో కీలక భూమిక పోషించనుంది. ఏది ఏమైనా ఇలాంటి వాటన్నిటికీ స్పష్టమైన సమాధానం వచ్చాకే మోహన్ యాదవ్ హయాంలో మంత్రివర్గ తుది ముఖచిత్రం బయటపడనుంది. ప్రస్తుత మంత్రివర్గం ఏర్పడిన సమయంలో నాడు బీజేపీ.. లోక్‌సభ ఎన్నికలపై ప్రాథమికంగా దృష్టి సారించింది. సీఎంతో సహా 12 మంది మంత్రులు ఓబీసీ నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. డిప్యూటీ సీఎం రాజేంద్ర శుక్లాతో పాటు 9 మంది మంత్రులు అగ్రవర్ణ కులాలకు చెందినవారు. మరో ఐదుగురు ఎస్సీ, ఎస్టీలకు సంబంధించిన వారున్నారు. దీంతో ఇది ఉద్దేశ పూర్వకంగా కుల ప్రాతిపదికన మంత్రివర్గంలో చోటుకల్పించారనే చర్చలకు దారితీసింది. బిహార్‌లో ఎన్నికలు ముగియడంతో మధ్యప్రదేశ్‌లో 2028లో జరగబోయే ఎన్నికలు కీలక కానున్న తరుణంలో ఈ కుల సమీకరణలు సర్దుబాటయ్యే అవకాశమున్నట్టు తెలుస్తోంది.

# తొలుత పంచాయతీ

-మొదటిపేజీ తరువాయి

పొంగులేటి విలేకరుల సమావేశంలో వెల్లడించారు.

**బీసీలకు 42% రిజర్వేషన్లపై చిత్తశుద్ధితో కృషి**

మంత్రి పొంగులేటి మాట్లాడుతూ.. "స్థానిక సంస్థల్లో బీసీలకు 42% రిజర్వేషన్లు కల్పిస్తూ అసెంబ్లీలో బిల్లు ఆమోదించి గవర్నర్‌కు పంపితే అక్కడే ఆగిపోయింది. ఆర్డినెన్స్ తీసుకువస్తే హైకోర్టు స్టే విధించింది. సుప్రీంకోర్టుకు వెళ్తే... అక్కడ డిస్మిస్ అయింది. చిత్తశుద్ధితో బీసీలకు 42% రిజర్వేషన్ కల్పించాలని ప్రయత్నం చేసినా కేంద్రం సహకారం లేదు. కోర్టుల్లోనూ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిర్ణయం వచ్చింది. పంచాయతీలకు ఎన్నికలు నిర్వహించకపోతే.. నిబంధనల ప్రకారం 15వ ఆర్థిక సంఘం నుంచి రావాల్సిన రూ.3 వేల కోట్ల నిధులు వచ్చే మార్చితో మురిగిపోయే పరిస్థితి ఉంది. దీంతోపాటు గ్రామాల్లో పాలన వ్యవస్థ పూర్తిగా నిర్వీర్యం అవుతున్న నేపథ్యంలో.. వీలైనంత త్వరగా ఎన్నికలు నిర్వహించాలని మంత్రివర్గం నిర్ణయించింది. డిసెంబరులోనే పంచాయతీ ఎన్నికలను పూర్తి చేసేందుకు కసరత్తు ప్రారంభించాలని, అందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని అధికారులను క్యాబినెట్ ఆదేశించింది. ఇప్పుడు ఎన్నికలకు వెళ్లాలంటే.. 50% మించకుండా రిజర్వేషన్ల జాబితాను మరోసారి డెడికేటెడ్ కమిషన్ నుంచి తెప్పించుకోవాల్సి ఉంటుంది. గ్రామపంచాయతీల సర్పంచులు, వార్డు సభ్యుల రిజర్వేషన్ల సంఖ్యపై డెడికేటెడ్ కమిషన్ నుంచి నివేదిక కోరాలని మంత్రివర్గం తీర్మానించింది. వారం రోజుల్లో ఈ ప్రక్రియను పూర్తి చేసి... క్యాబినెట్ ఆమోదం పొందాలని సూచించింది. బీసీ రిజర్వేషన్లపై కోర్టుల్లో తీర్పులు కొలిక్కి వచ్చిన తర్వాతే... ఎంపీటీసీ, జడ్పీటీసీ, మున్సిపల్ ఎన్నికలపై నిర్ణయం తీసుకోవాలని క్యాబినెట్ సమావేశంలో సుదీర్ఘంగా చర్చించిన తర్వాత నిర్ణయించాం. రాష్ట్రానికి రావాల్సిన రూ.3 వేల కోట్లు వదులుకోవడం ఇష్టం లేక పంచాయతీ ఎన్నికలు మాత్రమే పెట్టాలని తీర్మానించాం.

**మరికొన్ని నిర్ణయాలు**

తెలంగాణ సాధించుకున్న పదేళ్లలో రాష్ట్రానికి ప్రత్యేక అధికారిక గీతం లేకపోతే.. అందెశ్రీ రాసిన 'జయ జయహే తెలంగాణ'ను రాష్ట్ర గీతంగా ప్రకటించుకున్నాం. ఆ రుణాన్ని ఉడతాభక్తిగా తీర్చుకోవాలని ఆయన కుమారుడు దత్తసాయికి డిగ్రీ కాలేజీ అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా ఉద్యోగం ఇవ్వాలని క్యాబినెట్ తీర్మానించింది. 'జయ జయహే తెలంగాణ' గీతాన్ని ప్రతి పాఠ్యపుస్తకం మొదటి పేజీలో ముద్రించాలని నిర్ణయించాం. తెలంగాణ ఉద్యమంలో అందెశ్రీ పాత్ర గురించి భావితరాలకు తెలియజేసేలా.. రాష్ట్రంలో అందెశ్రీ స్మృతివనం ఏర్పాటుకు నిర్ణయించాం.




ఎస్ఆర్ఎస్‌పీ ఫేజ్-2 ప్రధాన కాలువకు దివంగత నేత రాంరెడ్డి దామోదరరెడ్డి పేరు పెట్టాలని తీర్మానించాం. ఓఆర్ఆర్ లోపల ఉన్న పరిశ్రమలను బయటికి తరలించాలని గతంలోనే నోటీసులు ఇచ్చాం. ఆ భూములను 'మల్టీ యూజ్ జోన్లు'గా వినియోగించుకోవాలని నిర్ణయించాం. వాటికి ఎదురుగా ఉన్న రోడ్డు వెడల్పును బట్టి రాష్ట్ర ప్రభుత్వానికి రుసుం కట్టాలి. ఇందుకోసం హైదరాబాద్ ఇండస్ట్రియల్ ల్యాండ్స్ ట్రాన్స్‌ఫర్మేషన్ పాలసీకి క్యాబినెట్ ఆమోదం తెలిపింది.

డిసెంబరు 7 నాటికి ప్రజా ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు పూర్తి కావస్తోంది. ఈ సందర్భంగా ఫ్యూచర్ సిటీలో డిసెంబరు 8, 9 తేదీల్లో 'తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమిట్-2047' ఏర్పాటు చేయాలని నిర్ణయించాం. రెండేళ్లలో ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలు, సాధించిన విజయాలను 8న సమిట్ వేదికగా వివరిస్తాం. అందుకు యుద్ధప్రాతిపదికన ఏర్పాట్లు చేయాలని అధికారులను క్యాబినెట్ ఆదేశించింది. వచ్చే నెల 9న 'తెలంగాణ రైజింగ్ 2047' దార్శనిక పత్రం (విజన్ డాక్యుమెంట్) విడుదల చేస్తాం" అని పేర్కొన్నారు.

**సౌదీకి మృతుల కుటుంబసభ్యులను తీసుకెళతాం**

ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ మాట్లాడుతూ.. "సౌదీలో జరిగిన ప్రమాదంలో చనిపోయినవారి ఇళ్లకు వెళ్లి... కుటుంబ సభ్యులతో మాట్లాడాం. పవిత్ర స్థలం అయినందున మక్కాలోనే అంత్యక్రియలు చేయాలని వారు కోరుతున్నారు. అక్కడి భారత ఎంబసీ అధికారులతో మాట్లాడాం. మృతులు ఒక్కొక్కరికి రూ.5 లక్షల చొప్పున పరిహారం అందజేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. కేంద్ర ప్రభుత్వం, సౌదీ ప్రభుత్వంతో సమన్వయం చేసుకోవడానికి.. మంత్రి అజారుద్దీన్, ఎంఐఎం ఎమ్మెల్యే, మైనారిటీ విభాగానికి చెందిన ఒక అధికారితో కూడిన ప్రభుత్వ ప్రతినిధి బృందాన్ని వెంటనే సౌదీకి పంపించాలని క్యాబినెట్ నిర్ణయించింది. మృతుల కుటుంబాల నుంచి ఇద్దరిని చొప్పున రాష్ట్ర ప్రభుత్వ ఖర్చులతో పంపాలని నిర్ణయించాం. వారికి సౌదీ అరేబియా వీసాల కోసం ప్రయత్నాలు చేస్తున్నాం" అని తెలిపారు.

**త్వరలో గిగ్ వర్కర్ల సంక్షేమ చట్టం: మంత్రి వివేక్ వెంకటస్వామి**

గిగ్ వర్కర్ల సంక్షేమానికి ప్రత్యేక చట్టాన్ని రాష్ట్రంలో తీసుకురానున్నట్లు కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి తెలిపారు. మంత్రివర్గ సమావేశం అనంతరం సోమవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. "గిగ్ వర్కర్లకు సరైన వేతనాలు చెల్లించాలనే డిమాండ్‌తో.. జాతీయస్థాయిలో చట్టం తీసుకురావాలని రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్రలో చెప్పారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్న కర్ణాటక అసెంబ్లీలో దీనికి సంబంధించిన చట్టం ఆమోదం పొందింది. తెలంగాణలోనూ 4 లక్షల మంది గిగ్ కార్మికులకు పూర్తి భద్రత భరోసా కల్పించేలా చట్టాన్ని తీసుకురానున్నాం. ఇందులో 3 లక్షల మంది వరకూ జీహెచ్ఎంసీ పరిధిలో ఉన్నారు.

వీరికి ఎటువంటి సెలవులు లేకపోగా.. రోజుకు 10-12 గంటలు పనిచేయాల్సి వస్తోంది. సామాజిక భద్రత, ఫిర్యాదుల పరిష్కారం, గుర్తింపు తదితర అంశాలపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి 2024 డిసెంబరు 23న గిగ్ వర్కర్ల ప్రతినిధులతో సమావేశమయ్యారు. వారితో పలుమార్లు సంప్రదింపులు జరిపాం. దాదాపు 64 విజ్ఞప్తులు వచ్చాయి. వాటిని పరిశీలించిన అనంతరం రూపొందించిన బిల్లును క్యాబినెట్ ఆమోదించింది. కొత్త చట్టం ద్వారా గిగ్ వర్కర్లకు చట్టబద్ధమైన గుర్తింపు, సామాజిక భద్రత లభిస్తాయి. ప్రత్యేకంగా సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి, హక్కులకు రక్షణ కల్పిస్తాం. ఈ బోర్డులో గిగ్ వర్కర్స్ యూనియన్, అగ్రిగేటర్లు, ప్రభుత్వ ప్రతినిధులు ఉంటారు. గిగ్ వర్కర్లను రిజిస్టర్ చేసుకునే బాధ్యత చట్టంలో ఉంటుంది. ఒక అధికారిని ప్రత్యేకంగా నియమించి, వారి సమస్యలను తెలుసుకుంటాం. వాటి పరిష్కారాలను చట్టంలో పొందుపర్చుతున్నాం.

గిగ్ వర్కర్లకు వైద్య చికిత్స, ప్రమాద బీమా వంటివి ఏమేం కల్పించవచ్చో... అవన్నీ పొందుపర్చుతూ కొత్త చట్టాన్ని క్యాబినెట్ ఆమోదించింది. త్వరలోనే అసెంబ్లీలో ప్రవేశపెడతాం. గిగ్ వర్కర్లకు న్యాయం జరిగేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది. ఈ దిశగా చట్టం తీసుకురావడమనేది ఒక ఆరంభం మాత్రమే. మంత్రివర్గం ఆమోదించిన బిల్లు జాతీయస్థాయిలో తెలంగాణను మరింత ప్రత్యేకంగా నిలబెడుతుంది" అని వివేక్ వెంకటస్వామి పేర్కొన్నారు. "సిగాచీ కార్మికుల గురించీ క్యాబినెట్ చర్చించింది. సుమారు రూ.45-50 లక్షల వరకూ పరిహారాన్ని మృతి చెందినవారి కుటుంబాలకు పంపిణీ చేశారు. ఈ నెల 20న మరోసారి సమావేశమై ఈ సమస్యపై చర్చిస్తాం" అని వివేక్ వెంకటస్వామి పేర్కొన్నారు.

# సౌదీలో మృత్యు ఘోష

-మొదటిపేజీ తరువాయి

మొత్తం 46 మంది బస్సులో ప్రయాణిస్తుండగా ఒక్కరు మాత్రం ఈ ప్రమాదం నుంచి బయటపడినట్లు సమాచారం. మరణించిన నగర వాసుల్లో 18 మంది పురుషులు, 26 మంది మహిళలు కాగా వీరిలో 10 మంది చిన్నారులు ఉన్నారు. వీరి మృతదేహాలను జెడ్డాలోని కింగ్ ఫహద్, కింగ్ సల్మాన్, అల్ మిఖత్ ఆస్పత్రులకు తరలించినట్లు స్థానిక అధికారులు తెలిపారు. జెడ్డాలోని భారత రాయబార కార్యాలయ అధికారులు అక్కడి పరిస్థితిని పర్యవేక్షిస్తున్నారు. మృతదేహాలను మదీనాలోనే స్థానిక సంప్రదాయాల మేరకు ఖననం చేయడానికి ఉన్న అవకాశాలను పరిశీలిస్తున్నారు. ఈ ఘటనపై ప్రధాని మోదీ, ఉప రాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సహా పలువురు ప్రముఖులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబసభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఇటీవల ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూలు, హైదరాబాద్ సమీపంలోని చేవెళ్ల వద్ద జరిగిన రెండు ఘోర బస్సు ప్రమాదాలను మరిచిపోక ముందే మరో దుర్ఘటన జరగడం, ఏకంగా 44 మంది హైదరాబాదీలు మరణించడం నగరాన్ని కుదిపేసింది.

**మొత్తం 54 మంది యాత్రికులు**

ఉమ్రా యాత్ర కోసం నగరంలోని వివిధ ట్రావెల్ ఏజెన్సీల నుంచి మొత్తం 54 మంది ఈ నెల 9న బయలుదేరి వెళ్లారు. మక్కా సందర్శన అనంతరం నలుగురు అక్కడే ఆగిపోగా.. మరో నలుగురు కారులో మదీనాకు వెళ్లారు. మిగిలిన 46 మందీ బస్సులో మదీనా వెళ్తుండగా గమ్య స్థానానికి 25 కి.మీ దూరంలో, భారత కాలమానం ప్రకారం ఉదయం 1:30 గంటల సమయంలో ఈ ఘోరం జరిగింది. బస్సు రోడ్డు పక్కన ఆగి ఉండగా, ఆయిల్ ట్యాంకర్ ఢీకొట్టడంతో పేలుడు సంభవించినట్లు ప్రత్యక్ష సాక్షి ఒకరు చెప్పారు. అయితే ప్రమాదానికి కారణాలను సౌదీ అధికారులు దర్యాప్తు చేస్తున్నారు. జెడ్డాలో ఉన్న భారత కాన్సులేట్ జనరల్ కార్యాలయంలో 24 గంటల కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు కేంద్ర మైనారిటీ వ్యవహారాల శాఖ మంత్రి కిరెన్ రిజిజు త్రెలిపారు. 8002440003 (టోల్ ఫ్రీ), 00966122614093, 00966126614276 00966556122301 (వాట్సాప్) హెల్ప్‌లైన్ నంబర్లను ప్రకటించారు. ప్రమాదం గురించి తెలిసిన వెంటనే జెడ్డా నుంచి



అధికారుల బృందం ఘటనా స్థలికి, ఆస్పత్రులకు వెళ్లినట్లు అక్కడి కార్యాలయ వర్గాలు తెలిపాయి. రియాద్‌లోని ఎంబసీ కార్యాలయం కూడా సౌదీ అధికారులతో కలిసి పని చేస్తోంది. సౌదీ ప్రమాదం నేపథ్యంలో న్యూఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో కూడా అధికారులు కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేశారు. (కాంటాక్ట్ నంబర్లు.. వందన, పీఎస్ టు రెసిడెంట్ కమిషనర్, లైజన్ హెడ్ %-%ం91 98719 99044, సీహెచ్. చక్రవర్తి, పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్ %-% ం91 99583 22143, రక్షిత్ నాయక్, లైజన్ ఆఫీసర్ %-%ం91 96437 23157). ఇలావుండగా షెడ్యూల్ ప్రకారం యాత్రికుల బృందం ఈనెల 23న జెడ్డా నుంచి హైదరాబాద్‌కు బయలుదేరాల్సి ఉంది. ఈ మేరకు వీరికి విమాన టిక్కెట్లు సైతం బుక్ అయ్యాయి.

**ప్రధాని మోదీ సంతాపం**

ప్రమాదంపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. 'నేను తీవ్ర విచారంలో మునిగిపోయా. నా ఆలోచనలన్నీ ఆప్తుల్ని కోల్పోయిన వారి చుట్టూనే ఉన్నాయి. జెడ్డాలోని మన కాన్సులేట్, రియాద్‌లోని ఎంబసీ అవసరమైన సహాయ కార్యక్రమాలన్నీ చేపడుతున్నాయి. ఇక్కడి మన అధికారులు కూడా సౌదీ అధికారులతో కలిసి పని చేస్తున్నారు..' అంటూ మోదీ 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. రష్యా పర్యటనలో ఉన్న కేంద్రమంత్రి జైశంకర్ ప్రమాదంపై తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఉప రాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కూడా తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు.

**రేవంత్‌రెడ్డి దిగ్భ్రాంతి**

సౌదీ ప్రమాదంపై రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. వెంటనే స్థానిక అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేశారు. మృతుల కుటుంబ సభ్యులకు తీవ్ర సంతాపం తెలిపారు. ఢిల్లీలోని అధికారులు, సౌదీలోని రాయబారితోనూ మాట్లాడాలని, కేంద్ర ప్రభుత్వంతో సమన్వయం చేసుకుని సహాయకచర్యలు తీసుకోవాలని సీఎస్ కె.రామకృష్ణారావు, డీజీపీ శివధర్‌రెడ్డిని ఆదేశించారు. కాగా మృతుల కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున పరిహారం అందించాలని రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయం తీసుకుంది.

మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి మహ్మద్ అజారుద్దీన్ నేతృత్వంలో ఎంఐఎం ఎమ్మెల్యే, మైనారిటీ శాఖ అధికారితో కూడిన ప్రతినిధి బృందం తక్షణమే సౌదీ అరేబియాకు బయలుదేరి వెళ్లనుంది. మృతుల కుటుంబాలను ముఖ్యమంత్రి సూచనల మేరకు అన్ని రకాలుగా అదుకుంటామని, యుద్ధ ప్రాతిపదికన సహాయక చర్యలు చెప్పాట్టాలని సౌదీ అధికారులను కోరినట్లు మంత్రి అజారుద్దీన్ తెలిపారు. మృతులకు అక్కడే అంత్యక్రియలు నిర్వహించాలని, వారి కుటుంబాల నుంచి ఇద్దరిని అక్కడికి తీసుకెళ్లేందుకు ఏర్పాట్లు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. సీఎస్ ఢిల్లీలోని రాష్ట్ర ప్రభుత్వ సమన్వయ కార్యదర్శి గౌరవ్ ఉప్పల్‌తో మాట్లాడి తగు ఆదేశాలిచ్చారు. రాష్ట్ర సచివాలయంలో మృతుల కుటుంబసభ్యులకు అవసరమైన సమాచారం అందించేందుకు వీలుగా 79979 59754, 99129 19545 టోల్ ఫ్రీ నంబర్లతో కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేశారు. ప్రమాదానికి సంబంధించిన సహాయ సహకారాల కోసం పోలీసు విభాగం తరపున సంయుక్త పోలీసు కమిషనర్ (శాంతిభద్రతలు) తఫ్సీర్ ఇక్బాల్ పని చేస్తున్నట్లు హైదరాబాద్ సీపీ సజ్జనార్ తెలిపారు.

**ఎప్పుడూ ప్రమాదకరమే..**

సౌదీ అరేబియాలోని పవిత్ర స్థలాల నుంచి యాత్రికుల తరలింపు కొన్నిసార్లు ప్రమాదకరంగా మారుతోంది. ముఖ్యంగా హజ్ యాత్ర సమయంలో రోడ్లన్నీ బస్సులతో కిటకిటలాడుతుంటాయి. ట్రాఫిక్ జామ్‌లు ఎక్కువగా ఉంటాయి. 2023లో మక్కా నుంచి వెళ్తున్న ఓ బస్సును బ్రిడ్జిని ఢీకొట్టి మంటల్లో చిక్కుకోవడంతో 20 మంది మృత్యువాత పడ్డారు. సుమారు 25 మంది గాయపడ్డారు. 2019లో ఓ బస్సు మరో భారీ వాహనాన్ని ఢీకొట్టడంతో 35 మంది చనిపోయారు.

## మావోయిస్టు పార్టీకి మరో భారీ దెబ్బ

**లొంగుబాటలో ఆజాద్, రమేష్ - కంకణాల రాజిరెడ్డి కూడా ?**

**హైదరాబాద్ :** తెలంగాణలో మావోయిస్టు ఉద్యమానికి మరో భారీ దెబ్బ తగిలే సూచనలు కనిపిసతున్నాయి. నిషేధిత కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ ఇండియా (మావోయిస్ట్) ? సిపిఐ(మా) పార్టీ తెలంగాణ రాష్ట్ర కమిటీ సభ్యుడు కొయ్యడ సాంబయ్య అలియాస్ ఆజాద్ అలియాస్ గోపన్న , డివిజన్ కమిటీ సభ్యుడు అప్పాసి నారాయణ అలియాస్ రమేష్‌తో పాటు వారి క్యాడర్ 20 మంది లొంగిపోతున్నట్లు విశ్వసనీయమైన సమాచారం వెలుగులోకి వచ్చింది. ఈ సరెండర్ వచ్చే వారం రోజుల్లో జరిగే అవకాశాలు ఉన్నాయి. తెలంగాణ పోలీసులు 'ఆపరేషన్ చెయుత' పేరుతో లొంగుబాట్లను ప్రోత్సహిస్తున్నారు. 2025లో ఇప్పటికే 427 మంది మావోయిస్టులు లొంగిపోయారని, వీరిలో సీనియర్ నేతలు కూడా ఉన్నారని డీజీపీ బి. శివధర్ రెడ్డి ఇటీవల ప్రకటించారు. కొయ్యడ సాంబయ్య అలియాస్ ఆజాద్ అలియాస్ గోపన్న భద్రాద్రి కొత్తగూడెం-అల్లూరి సీతారామరాజు జిల్లా మొద్దుల గూడెం గ్రామానికి చెందిన వారు. 1995 నుంచి అజ్ఞాతంలో ఉన్నారు. తెలంగాణ రాష్ట్ర కమిటీ సభ్యుడు, భద్రాద్రి కొత్తగూడెం-అల్లూరి సీతారామరాజు (బీకేజీ-ఏఎస్ఆర్) డివిజన్ కమిటీ మాజీ కార్యదర్శి. రాష్ట్ర కమిటీ సెక్రటరీ హరిభుషణ్ మరణం తర్వాత లీడర్‌షిప్ పోటీలోఉన్నారు. కానీ బాదే చొక్క రావు అలియాస్ దామోదర్ సెక్రటరీగా ఎదిగారు. అతని తలపై రూ. 20 లక్షల రివార్డు ఉంది. అప్పాసి నారాయణ అలియాస్ రమేష్ పెద్దపల్లి జిల్లా రామగుండం ఎఫ్‌సిఐ ప్రాంతం స్వస్థలం. 1999 నుంచి అజ్ఞాతతంలోఉన్నారు. తెలంగాణ రాష్ట్ర కమిటీ టెక్నికల్ టీమ్ హెడ్, జమ్మూ కాశ్మీర్-వెస్ట్ పాకిస్తాన్ (జెఎన్‌డబ్ల్యూపీ) రీస్ట్రక్చరింగ్ బ్లాక్ మాజీ డివిజన్ కమిటీ సభ్యుడు. కరీంనగర్ కమిటీ మెంబర్‌గా ప్రారంభించి, డివిజన్ కమిటీ సభ్యుడిగా ఎదిగాడు. ఇతనిపై ఐదు లక్షల రివార్డు ఉంది. ఈ ఇద్దరూ మధ్యవర్తుల ద్వారా తెలంగాణ పోలీసులతో సంప్రదింపులు ప్రారంభించారు. వారితో పాటు డివిజన్, ఏరియా కమిటీల సభ్యులు 20 మంది సరెండర్ అవుతారని అంటున్నారు. మరో సీనియర్ రాష్ట్ర కమిటీ నేత కూడా లొంగిపోయేందుకు సిద్ధంగా ఉన్నట్లుగా తెలుస్తోంది. పార్టీలో మిగిలిన 64 మంది మావోయిస్టులు కూడా మెయిన్‌స్ట్రీమ్‌లో చేరే అవకాశం ఉందని భావిస్తున్నారు. ఉమ్మడి కరీంనగర్ పెద్దపల్లి ప్రాంతానికి చెందిన మావోయిస్టు కీలక నేత కంకణాల రాజిరెడ్డి సైతం ప్రభుత్వంతో చర్చలు జరుపుతున్నట్లు సమాచారం. కొద్ది నెలలుగా పెద్దపల్లి పోలీసులు ఆయన కుటుంబ సభ్యులతో సంప్రదించి, సరెండర్‌కు ప్రోత్సహిస్తున్నారు. రాజిరెడ్డి పార్టీలో కేంద్ర కమిటీ మెంబర్‌గా గుర్తింపు పొందాడు, రూ. 1 కోటి ఆయన తలకు వెల కట్టారు. సరెండ్ అయితే ప్రజాజీవితంలోకి వస్తానని తనకు పదవి ఇవ్వాలని ఆయన అడుగుతున్నట్లుగా చెబుతున్నారు. తెలంగాణలో మావోయిస్టు ఉద్యమం బలహీనపడుతోంది. 2025లో ఇప్పటికే 427 మంది లొంగిపోయారు, వీరిలో సీనియర్ నేతలు ఉన్నారు. ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ప్రజా జీవితంలోకి రావాలని పిలుపు ఇచ్చారు. పోలీసులు ఈ సరెండర్‌లకు సంబంధించి రిహాబిలిటేషన్ ప్యాకేజీలు అందించనున్నారు.

## ఖైరతాబాద్ పోలింగ్ కు రెడీ

**హైదరాబాద్ :** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మరో ఉప ఎన్నికకు సిద్ధమవుతున్నారని తెలుస్తోంది. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో కాంగ్రెస్ గెలుపుతో వచ్చిన ఉత్సాహంతో మరో ఉప ఎన్నికతో పార్టీ గ్రాఫ్ ను మరింత పెంచాలన్న యోచనలో ఉన్నారు. ఈరోజు ఢిల్లీ పర్యటనలో ఉన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ లు పార్టీ పెద్దలను కలసి అనుమతి తీసుకునే అవకాశాలున్నాయి. ప్రధానంగా ఖైరతాబాద్ నియోజకవర్గంలో ఉప ఎన్నికకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సిద్ధమవుతున్నారు. ఇప్పటి వరకూ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత కంటోన్మెంట్, జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో జరిగిన ఉప ఎన్నికల్లో గెలిచిన తర్వాత ఖైరతాబాద్ ఉప ఎన్నికకు ఆయన సిద్ధమవుతున్నారని సమాచారం. దానం నాగేందర్ పై ఇప్పటికే అనర్హత వేటు కత్తి వేలాడుతుంది. 2023లో జరిగిన శాసనసభ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీ చేసి విజయం సాధించిన దానం నాగేందర్ తర్వాత కాంగ్రెస్ పార్టీకి దగ్గరయ్యారు. మొత్తం పది మంది ఎమ్మెల్యేలు బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ కు చేరువైనా దానం నాగేందర్ ది మాత్రం ప్రత్యేక కేసుగా చూడాలి. ఆయన ఖైరతాబాద్ ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయకుండా 2024 పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా సికింద్రాబాద్ నుంచి పోటీ చేశారు. అందుకే ఆయనపై అనర్హత వేటు పడటం ఖాయమని దాదాపు తేలిపోయింది. దీంతో దానం నాగేందర్ కూడా ముందుగానే రాజీనామా చేసి తిరిగి ఉప ఎన్నికలకు వెళ్లాలన్న యోచనలో ఉన్నారు. ఖైరతాబాద్ నుంచి... అనుకోకుండా వచ్చిన జూబ్లీహిల్స్ నియోజకవర్గం ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ అద్భుతమైన విజయం సాధించడంతో ఇక దానం నాగేందర్ కూడా త్వరలోనే రాజీనామా చేస్తారన్న ప్రచారం ఊపందుకుంది. స్పీకర్ అనర్హత వేటు వేయకముందే ముందుగా తన పదవికి రాజీనామా చేయాలని, స్పీకర్ వెంటనే ఆమోదిస్తే మరో ఆరు నెలల్లో ఉప ఎన్నిక జరుగుతుందన్న అంచనాలు వినపడుతున్నాయి. అందుకే పార్టీ ఢిల్లీ నాయకత్వం సూచనలను కూడా పరిగణనలోకి తీసుకున్న తర్వాత దీనిపై క్లారిటీ వచ్చే అవకాశముంది. ఈ ఊపులోనే ఉప ఎన్నికలకు వెళ్లి ఖైరతాబాద్ ను కూడా ఉప ఎన్నికల్లో గెలుచుకుని తమకు తిరుగులేదని నిరూపించుకోవాలన్న భావనలో రేవంత్ రెడ్డి ఉన్నారు. దీంతో తెలంగాణలో మరో ఉప ఎన్నిక ఖాయమనిపిస్తుంది.

## బీజేపీ పెద్దలకు దగ్గరవుతున్న చంద్రబాబు

**విజయవాడ:** ఏపీ సీఎం చంద్రబాబుకేంద్ర పెద్దల వైఖరి పూర్తిగా మారిపోయిందని చెప్పవచ్చు. 2024 ఎన్నికల ఫలితాలు వచ్చిన తర్వాత చంద్రబాబు ప్రాధాన్యం కేంద్రంలో పెరిగింది. దానికి కారణం ఎన్డీఏలో కీలక భాగస్వామిగా ఉండి.. మోదీ మూడోసారి ప్రధాని అయ్యేందుకు అవసరమైన సంఖ్యా బలాన్ని అందించగలిగింది తెలుగుదేశం పార్టీ. అయితే గత అనుభవాల దృష్ట్యా చంద్రబాబు కేంద్ర పెద్దలతో చాలా సఖ్యతగా మెలుగుతూ వచ్చారు. గతానికి భిన్నంగా వ్యవహరిస్తున్నారు. ఏ విషయంలోనూ గాబరా పడటం లేదు. కేంద్రంతో ఇబ్బందులు తెచ్చుకునే పరిస్థితి లేదు. అయితే ఈ కేంద్ర పెద్దలతో నమ్మదగని మిత్రుడు అనిపించుకున్నారో.. అదే పెద్దలతో శభాష్ అంటూ చప్పట్లు కొట్టించుకుంటున్నారు. విశాఖ పెట్టుబడుల సదస్సులో అయితే కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ చంద్రబాబుకు సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ఏపీ సీఎం మాట్లాడుతున్నంతసేపు తన చప్పట్లతో ప్రోత్సాహం అందిస్తూ వచ్చారు. అలాగని ఆయన ఏదో ఒక డమ్మీ కేంద్రమంత్రి కాదు. అక్షరాల ప్రధాని నరేంద్ర మోదీ కోర్ టీంలో ఉన్న నేత. 2018లో ఎన్డీఏనుంచి దూరమయ్యారు చంద్రబాబు. అప్పటివరకు కేంద్ర ప్రభుత్వంతో భాగస్వామ్యమై పనిచేసిన ఆయన.. ఉన్నఫలంగా కేంద్ర ప్రభుత్వానికి దూరమయ్యారు. ఏపీకి ప్రత్యేక హోదా విషయంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ట్రాప్ లో పడ్డారు. ఆ సమయంలో కేంద్ర పెద్దలతో ఢీ కొట్టినంత పని చేశారు. అప్పుడే ఏపీలో చంద్రబాబు పని పట్టాలని కేంద్ర పెద్దలు నిర్ణయించుకున్నారు. కేంద్రానికి చెందిన ప్రత్యేక టీం ఏపీలో పనిచేసింది. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అద్భుత విజయం వెనుక బిజెపి వ్యూహాలు ఉన్నట్లు అప్పట్లో టిడిపి అనుమానించింది. అయితే 2019 నుంచి 2024 మధ్య ప్రతి పరిణామాన్ని గుణపాఠంగా మార్చుకుంది టిడిపి. తన తప్పు తెలుసుకున్న చంద్రబాబు కేంద్ర పెద్దలతో సఖ్యత ఏర్పాటు చేసుకున్నారు. అయితే ఇప్పటికీ కేంద్ర పెద్దలు చంద్రబాబును నమ్మడం లేదన్న ప్రచారానికి చెక్ చెబుతూ.. కేంద్రమంత్రి పీయూష్ గోయల్ చంద్రబాబుకు అభినందనలతో ముంచెత్తడం విశేషం. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త ఆధ్వర్యంలో.. సిఐఐ నేతృత్వంలో విశాఖలో పెట్టుబడుల సదస్సు జరిగింది. దాదాపు 13 లక్షల కోట్ల రూపాయల పెట్టుబడులు వచ్చాయి. అయితే కేంద్ర ప్రభుత్వం సంపూర్ణ సహకారం అందిస్తోంది అని ఈ పెట్టుబడుల సదస్సుతో తేలిపోయింది. గత కొద్ది రోజులుగా ప్రపంచ దిగ్గజ సంస్థలు ఏపీకి వస్తున్నాయి. భారీగా పెట్టుబడులు పెడుతున్నాయి. కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలు సైతం ఏర్పాటు అవుతున్నాయి. తద్వారా ఏపీకి తమ సాయం ఉంటుందని కేంద్రం స్పష్టమైన సంకేతాలు పంపుతోంది. 2014 నుంచి 2024 వరకు ఏపీ విషయంలో కేంద్రం నుంచి అసంపూర్ణ సహకారం అందేది. కానీ గడిచిన 17 నెలల కాలంలో కేంద్రం వైఖరి చూస్తుంటే ఏపీ పట్ల పూర్తి ఉదారస్వభావం చూపుతున్నట్లు అర్థమవుతోంది. స్వయంగా ప్రధానికి అత్యంత సన్నిహితుడు అయిన పీయూష్ గోయల్ ఏపీ సీఎం చంద్రబాబు పట్ల చూపుతున్న గౌరవం చూస్తుంటే మాత్రం.. బిజెపి పెద్దలకు అత్యంత ఇష్టమైన నాయకుడిగా చంద్రబాబు అవతరించారని అనడంలో ఎటువంటి అతిశయక్తి లేదు.

# నిబంధనల పేరుతో రద్దు చేసిన రైస్ కార్డులు,పించన్లు తక్షణమే పునరుద్ధరించాలి.ఏపీ ఆదివాసీ జేఏసీ డిమాండ్.

**సామాన్యుడి అస్త్రం దేవీపట్నం :** షెడ్యూల్డ్ ప్రాంతంలో నిబంధనల పేరుతో రద్దు చేసిన రైస్ కార్డులు,పించన్లు తక్షణమే పునరుద్ధరించాలని ఏపీ ఆదివాసీ జేఏసీ రాష్ట్ర వైస్ చైర్మన్ తెల్లం శేఖర్ డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా తెల్లం శేఖర్ మాట్లాడుతూ....అల్లూరి సీతారామరాజు జిల్లా,రంపచోడవరం నియోజకవర్గం,దేవీ పట్నం మండల పరిధిలోని,దేవారం గ్రామంలో ఎస్టీ కోయ తెగకు చెందిన కొమరం సావిత్రమ్మ 68 ఏళ్ల ముసలమ్మ భర్త కొమరం సుబ్బారావు దొర గత 30 సంవత్సరాల క్రితమే అనారోగ్యం తో మరణించాడు. వారికి కల్గిన ఇద్దరు అబ్బాయిలలో పెద్ద కుమారుడు అనారోగ్య సమస్య తో బాధ పడుతున్నాడు.రెండో కుమారుడు వివాహం చేసుకొని వేరే గ్రామంలో నివాసం ఉంటూ రోజు వారీ కూలి పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు.అయితే గత ప్రభుత్వం భూమి ఎక్కువగా ఉందనే కారణంతో కొమరం సావిత్రమ్మ అప్పటి వరకు రేషన్ సరుకులు తెచ్చు కుంటున్న రేషన్ కార్డు మరియు సామాజిక వితంతు పెన్షన్ రద్దు చేశారు.ప్రస్తుతం కొమరం సావిత్రమ్మ రోజు వారీ కూలీ పనులకు వెళ్ళ లేక పోతుంది.ఇదే గ్రామంలో 74 ఏళ్ల వయసు ఉన్న కారం రంగా రావు దొర కుటుంబానికి మరియు 61 ఏళ్ళ వయసు ఉన్న కారం బుల్లి దొర కుటుంబానికి ఇలా షెడ్యూల్డ్ ప్రాంతంలో భూమి ఎక్కువగా ఉందనే కారణంతో సుమారు పదివేల ఆదివాసీ కుటుంబాలకు సంబందించిన రేషన్ కార్డులు,సామాజిక పించన్లు రద్దు చేసిందన్నారు.కానీ వాస్తవానికి షెడ్యూల్డ్ ప్రాంతంలో భూమి ఎంత ఎక్కువగా ఉన్న వర్షాధారం మీద ఆధారపడి



పండిన పంట రాత్రింబవళ్ళు అటవీ జంతువులు మరియు పక్షులు నుండి కాపాడిన పంట దిగుబడి అంతంత మాత్రమే ఉంటుంది.కావున షెడ్యూల్డ్ ప్రాంతంలో పరిస్థితులు భిన్నంగా ఉంటాయి,మైదాన ప్రాంతాల్లో పరిస్థితులు వేరే విధంగా ఉంటాయి.కావున కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే స్పందించి షెడ్యూల్డ్ ప్రాంతంలో నిబంధనల పేరుతో రద్దు చేసిన రైస్ కార్డులు సామాజిక పించన్లు తక్షణమే పునరుద్ధరించాలని ఏపీ ఆదివాసీ జేఏసీ రాష్ట్ర వైస్ చైర్మన్ తెల్లం శేఖర్ డిమాండ్ చేశారు.లేదంటే భవిష్యత్ లో జరగబోయే స్థానిక ఎన్నికల్లో ఆదివాసీ ప్రజలు ఓటు బ్యాంకుతో తగిన గుణపాఠం చెప్పడానికి సిద్ధంగా ఉన్నారని హెచ్చరించారు.

# మా గోడు పట్టదా- మా ఫిర్యాదులు ప్రజా సమస్య కోణంలో ఎందుకు ఆలోచించడం లేదు

**నరసాపురం మెటల్ క్వారీ వలన నష్టపోతున్న దిరిసనపల్లి నరసాపురం గ్రామస్తులు ఆవేదన -ఐటీడీఏ పిఓ కు వినతి**

**సామాన్యుడి అస్త్రం రంపచోడవరం :** సోమవారం నాడు ఐటిడిఏ ప్రజా గ్రీవెన్స్ నందు నర్సాపురం మెటల్ క్వారీ వలన నష్టపోతున్న నరసాపురం మరియు దిరిసిన పల్లి గ్రామ బాధితులు ఐటీడీఏ పిఓకి వినతి పత్రం అందజేసి మరియు సమస్యను తెలియజేశారు. బాధితుల ఫిర్యాదులను ప్రజా సమస్య కోనల్లో ఎందుకు చూడటం లేదని, క్వారీలో జరుగుతున్న బాంబు బ్లాస్టింగ్ వలన ప్రజల ఆరోగ్యం పాడవ్వటమే కాకుండా స్థిర నివాసాలు ధ్వంసం అవుతున్నాయని, విచ్చలవిడి బాంబ్ బ్లాస్టింగ్ వలన పర్యావరణ కాలుష్యం కూడా జరుగుతుందని ఎన్నోసార్లు ఫిర్యాదు చేసినప్పటికీ స్థానిక అధికారులకు మసి బూసి మారడు కాయ చేస్తున్నారే తప్ప, నష్టం జరుగుతున్న ఆదివాసులకు న్యాయం చేసే కోణంలో ఎందుకు ఆలోచించడం లేదని బాధితుల ఆవేదన వ్యక్తపరిచారు. ఈ సందర్భంగా ఆదివాసి సంక్షేమ పరిషత్ నాయకులు మాట్లాడుతూ ఆదివాసి సంక్షేమ పరిషత్ ఎల్లప్పుడూ ఆదివాసీల అభివృద్ధి కొరకు సంరక్షణ, చట్టల పరిరక్షణ కొరకు పని చేస్తుందని, ఆదివాసీలు ఆదివాసియేతరుల మాటలు విని సంఘంపై బురద చల్లి సంఘ సభ్యులను అవమాన పరచాలనిచూస్తే ఆదివాసులు ఆదివాసీలు ఆదివాసులను నిందించుకున్నట్టే అని హితవు పలికారు. విచారణ జరిపిన ప్రతిసారి అధికారులు క్వారీ నిర్వహణకుల మాయ మాటలు విని క్వారీ కావాలని కోరుకుంటున్న ప్రజలు మాత్రమే చూస్తున్నారని, కానీ ఆ క్వారీ వల్ల నష్టపోతున్న ప్రజల నష్టాన్ని, బాధలను ఎందుకు పట్టించుకోవట్లేదని




నాయకులు అధికారులను ప్రశ్నించారు. క్వారీ అన్ని నియమ నిబంధనలతో నడుస్తున్నట్లయితే తమ సంఘానికి ఎటువంటి అభ్యంతరం లేదని, కానీ ప్రజా ఆరోగ్యం, భద్రత, పర్యావరణానికి ముప్పు వాటిల్లుతుం దంటే సంఘం చూస్తూ ఊరుకోదని ఆదివాసి సంక్షేమ పరిషత్ ఆదివాసులకి అన్యాయం జరిగే చోట బాధితులకు న్యాయం జరగటానికి పోరాడే హక్కు ఉందని వారు తెలియజేశారు. ప్రజలు కూడా ఆలోచించి క్వారీ వలన ప్రజలకు జరుగుతున్న అన్యాయం పట్ల పోరాడాలని, పోరాడుతున్న సంఘాలకు మద్దతుగా ఉండాలని వారు కోరారు. ఎటువంటి అడ్డంకులు ఎదురైనా కోరి వాళ్ళ నష్టపోతున్న బాధితులకు న్యాయం చేసే వరకు తమ సంఘం ఉద్యమిస్తూనే ఉంటుందని, ఎన్ని కుట్రలు చేసినా ఈ ఉద్యమాన్ని ఆపలేరని వారు తెలియజేశారు. కార్యక్రమంలో ఆదివాసి సంక్షేమ పరిషత్ డివిజన్ కోఆర్డినేటర్ పీతా ప్రసాద్, నాయకులు కంగాల అబ్బాయి దొర, చోడి ఏడుకొండలు రావు, సోడి అనిల్ కుమార్ దొర, వీరభద్రరావు ,క్వారీ బాధితులు తదితరులు పాల్గొన్నారు.

# బీసీ హక్కుల సాధన కోసం నవంబర్ 19న జమ్మికుంటలో భారీ బీసీ సదస్సు

**౨ విజయవంతం చేయాలని పిలుపు**

**సామాన్యుడి అస్త్రం, హుజురాబాద్ :** ఈ నెల 19వ తేదీ బుధవారం ఇందిరానగర్‌లోని దినేష్ కన్వెన్షన్ హాల్‌లో జరుగనున్న “బీసీల హక్కులు బీసీలకే దక్కాలి, బీసీ రిజర్వేషన్లు ప్రజాస్వామిక హక్కే” అనే నినాదంతో మానవ హక్కుల వేదిక ఆధ్వర్యంలో భారీ బీసీ సదస్సును నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ శనిగరపు తిరుపతయ్య తెలిపారు. సోమవారం పట్టణంలోని విజ్డమ్ జూనియర్ కాలేజ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ హుజురాబాద్ నియోజకవర్గంలో పార్టీ, వర్గ భేదాలు పక్కన పెట్టి అన్ని బీసీ సముదాయాలు, మహిళలు, యువత, విద్యార్థులు భారీ ఎత్తున హాజరై సదస్సును విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో కేడీసీసీ బ్యాంక్ జిల్లా ఉపాధ్యక్షులు పింగిలి రమేష్, సింగిల్ విండో సొసైటీ అధ్యక్షులు పొనగంటి సంపత్, మాజీ సర్పంచ్‌లు పొన్నగంటి మల్లయ్య, సురేంద్రరాజు, కార్మిక సంఘ నాయకులు గుంటి సామ్రాజ్యం, బీసీ సంక్షేమ సంఘం మండల అధ్యక్షులు ఏ. బూసి శ్రీనివాస్, బీజేపీ పట్టణ అధ్యక్షులు కొలకాని రాజులు మాట్లాడారు. సదస్సులో హాజరు కానున్న ప్రముఖులు రిటైర్డ్ ఐఏఎస్ అధికారి 42% బీసీ రిజర్వేషన్ సాధన సమితి నాయకులు టి. చిరంజీవులు కాకతీయ యూనివర్సిటీ ప్రొఫెసర్ మురళీ మనోహర్ మానవ హక్కుల




వేదిక నాయకులు ఎస్. జీవన్ కుమార్ సామాజిక న్యాయ వేదిక నాయకులు రంగు రాజేశం సదస్సు ప్రధాన డిమాండ్లు బీసీ జనాభా నిష్పత్తి మేరకు విద్యా, ఉద్యోగ, ఉపాధి, స్థానిక సంస్థలు, చట్టసభల్లో 42% రిజర్వేషన్లు అమలు చేయాలి. కోర్టులు అడ్డురాని విధంగా రాజ్యాంగబద్ధ చట్టం చేయాలి. కేంద్ర స్థాయిలో కూడా రిజర్వేషన్లు పెంపు. ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్ల అమలు. బీసీలలో వర్గీకరణ విద్య, ఉద్యోగాలతో పాటు రాజకీయాల్లో కూడా అమలు చేయాలి. మహిళలకు వారి దామాషా మేరకు అన్ని వర్గాల్లో ప్రాతినిధ్యం. స్థానిక సంస్థల ఎన్నికల నాటికి అన్ని పార్టీలు కలిసి పెంచిన రిజర్వేషన్లకు చట్టబద్ధత కల్పించాలి. ఈ కార్యక్రమంలో తాజా మాజీ కౌన్సిలర్ పొనగంటి రాము, టిపిటిఎల్ నాయకులు రెహమాన్, ప్రవీణ్ కుమార్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## పాపయ్యపల్లిలో ప్రకృతి వ్యవసాయ వరి ఫీల్డ్‌మేళా




**సామాన్యుడి అస్త్రం జమ్మికుంట :** జమ్మికుంట మండలంలోని పాపయ్యపల్లి గ్రామంలో జి.ఎన్.ఎన్.ఎస్ కృషి విజ్ఞాన్ కేంద్రం ఆధ్వర్యంలో, అజీమ్ ప్రేమ్‌జీ వారి ఆర్థిక సహకారంతో నడుస్తున్న ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్ట్‌లో భాగంగా వరి పంట ఫీల్డ్‌మేళా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సేద్య విభాగ శాస్త్రవేత్త విజయ్, ప్రకృతి వ్యవసాయం ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ కుమార్, ఇంచార్జ్ మురళీధర్ పాల్గొన్నారు. రైతులకు ప్రకృతి వ్యవసాయం ప్రాముఖ్యత, వివిధ పంటల్లో పాటించాల్సిన పద్ధతులు, జీవామృతం ఘనా జీవామృతం వినియోగం, మట్టి ఆరోగ్యం గురించి వివరించారు. అలాగే ఇప్పటికే ప్రకృతి వ్యవసాయం చేసిన రైతుల అనుభవాలను ఇతరులకు తెలియజేశారు. తదుపరి వడిజే రాజేశ్వర్ రావు ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో సాగు చేసిన వరి క్షేత్రాన్ని పరిశీలించారు. ఈ ఫీల్డ్‌మేళాలో సుమారు 60 మంది రైతులు పాల్గొన్నారు. ఫీల్డ్ కోఆర్డినేటర్లు ఎడ్ల రమేష్, అభిషేక్, శ్రీనివాస్, ఉదయ్, రమాదేవి, రాము, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు

## శ్రీరాములపల్లి గ్రామంలో గర్భిణీ ఆత్మహత్య కుటుంబంలో విషాదఛాయలు



**సామాన్యుడి అస్త్రం ఇల్లంతకుంట :**ఇల్లంతకుంట మండలం శ్రీరాములపల్లి గ్రామంలో మంగళవారం విషాద ఘటన చోటుచేసుకుంది. 7 నెలల గర్భిణీ మౌనిక (24) ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన స్థానికంగా కలకలం రేపింది. గత సంవత్సరం డిసెంబర్‌లో మౌనిక వివాహం జరిగింది. భూపాలపల్లి జిల్లా గణపురం మండలం బుద్ధారం గ్రామానికి చెందిన ప్రశాంత్‌ను వివాహం చేసుకున్న ఆమె, కొంతకాలంగా అదనపు కట్నం కోసం వేధింపులు ఎదుర్కొంటున్నట్లు మృతురాలి కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. అదనపు కట్నం కోసం మా కూతురిని వేధించడంతోనే ఆమె ప్రాణాలు తీసుకుంది అని మౌనిక తల్లి ఆవేదన వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న ఎస్సై క్రాంతికుమార్ సంఘటనా స్థలాన్ని పరిశీలించి, కేసును నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు తెలిపారు

## జనగామ జిల్లా లో గడ్డి మందు తాగి యువకుడు మృతి



**సామాన్యుడి అస్త్రం జనగామ** జనగామ జిల్లా తరిగొప్పుల మండల నర్సాపూర్ గ్రామానికి చెందిన పల్లె సంజయ్ (19) అనే యువకుడు ప్రేమ విఫలం కావడంతో నిన్నటి రోజున అనగా ఆదివారం సాయంత్రం గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా గ్రహించిన కుటుంబ సభ్యులు బాధితుడిని చికిత్స నిమిత్తం వరంగల్ లోని ఎంజీఎం ఆసుపత్రికి తరలించారు, పరిస్థితి విషమించడంతో చికిత్స పొందుతున్న యువకుడు సంజయ్ ఈ రోజు మధ్యాహ్నం రెండు గంటల ప్రాంతంలో మృతి మృతిచేందాడు

## కన్నుల పండుగగా బాలాజీ నగర్ లో కార్తీక దీపోత్సవం



**సామాన్యుడి అస్త్రం జనగామ** కార్తీక మాసం సందర్భంగా జిల్లా కేంద్రంలోని మూడో వార్డు పరిధిలో ఉన్న బాలాజీ నగర్ శ్రీ రేణుక ఎల్లమ్మ దేవాలయంలో కార్తీక దీపోత్సవం కన్నుల పండుగగా జరిగింది. కార్తీకమాసం 26వ రోజు సందర్భంగా కన్న పరశురాములు-సత్తెమ్మ, దూడల రమేష్- శోభారాణి దంపతులచే ఆలయ పూజారి మారుపాక శ్యాంప్రసాద్ ప్రత్యేక పూజా కార్యక్రమం నిర్వహించారు. నమః పార్వతీ పతయే హర హర మహాదేవ శంభో శంకర శివోహం అంటూ ఆధ్యాత్మిక శోభతో భక్తులు కార్తిక దీపాలు వెలిగించి కైలాస వాసుడు పరమశివుని యొక్క నామస్మరణం చేశారు.కార్తీకమాసం పరమేశ్వరుని ప్రతిరోజు విశేషమైన అలంకరణతో ప్రత్యేక పూజలు నిర్వహించడం వల్ల భక్తులకు స్వామివారి కృపా కటాక్షాలు ఆశిస్సులు లభిస్తాయని నమ్మకం. దీపోత్సవం అనంతరం అర్చకులు భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. భక్తులు వెలిగించిన కార్తీక దీపాలు ఆలయంలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.అనంతరం విష్ణు హరిహరల పారాయణం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో లగిశెట్టి పద్మావతి, దోసపాటి శ్రీలక్ష్మి, మాదారపు కల్పన, నవ్య, దూడల నిషిత,బండోజు సరళ, గూడేల్లి సంధ్య, గట్టు విజయ, విమల,కేమెడీ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యేను కిడ్నాప్ చేస్తే ఇలాగే ఊరుకుంటారా..

**దళితుల ప్రాణాలు అంత అలుసా..?**

**షాద్ నగర్ సీనియర్ న్యాయవాది, సీనియర్ నేత దానక్క సంగమేశ్వర్**

**దళిత ఎర్ర రాజశేఖర్ హత్యపై సంచలన వ్యాఖ్యలు**

**సమాజంలో సామాన్యులకు ఏం రక్షణ కల్పిస్తున్నట్లు..?**

**సామాన్యుడి అస్త్రం షాద్ నగర్ :** ఒక ఎమ్మెల్యేను కిడ్నాప్ చేస్తే పోలీసు యంత్రాంగం అధికార యంత్రాంగం ఊరుకుంటుందా..? మొత్తం యంత్రాంగమే కదిలిపోతుంది.. ప్రముఖుల వైతే ప్రాణాలు మరి సామాన్యులవి దళితులవి ప్రాణాలు కావా..? సమాజంలో సామాన్యుల ప్రాణాలకు ఇచ్చే విలువ ఇదేనా..? అంటూ రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ సీనియర్ న్యాయవాది, ప్రముఖ రాజకీయ నాయకులు దానక్క సంగమేశ్వర్ సంచల వ్యాఖ్యలు చేశారు. సోమవారం ఆయన మీడియాకు విడుదల చేసిన ప్రకటనలో సంచలన వ్యాఖ్యలు చేయడం గమనార్హం. ఫరూక్ నగర్ మండలం ఎల్లంపల్లి గ్రామానికి చెందిన దళిత యువకుడు ఎర్ర రాజశేఖర్ ను అదే గ్రామానికి చెందిన వెంకటేష్ తదితర వ్యక్తులు కలిసి దారుణంగా కిడ్నాప్ చేసి సజీవ దహనం చేశారని, కిడ్నాప్ జరిగిన సమయంలో స్థానిక పోలీసులను బాధిత కుటుంబ సభ్యులు ఆశ్రయించారని కానీ పోలీసులు నిర్లక్ష్యం చేయడంతోనే రాజశేఖర్ ను హతమార్చారని, పోలీసు యంత్రాంగం నిర్లక్ష్యం ఇందులో స్పష్టంగా కనిపిస్తుందని దానక్క సంగమేశ్వర్ ఆరోపించారు. కిడ్నాప్ జరిగిన కొద్దిసేపట్లోనే పోలీసులను బాధితులు ఆశ్రయించారని కానీ పోలీసులు పట్టించుకోకుండా కేసును తేలిగ్గా తీసుకున్నారని ఈ నిర్లక్ష్యమే రాజశేఖర్ నిండు ప్రాణం బలై ఎందుకు కారణమైందని అన్నారు. సామాన్యుల ప్రాణాలకు విలువ లేదా? ప్రముఖులకు మాత్రమే పోలీసులు భద్రత కల్పిస్తారా? అని ధనక్క సంగమేశ్వర్ ప్రశ్నిస్తున్నారు. ఎర్ర రాజశేఖర్ హత్యోదంతంలో పోలీసుల పాత్ర సమంజసంగా లేదని ఆయన సంచలన వ్యాఖ్యలు చేశారు. పోలీసులు సరైన సమయంలో స్పందించి ఉంటే రాజశేఖర్ ను కిడ్నాప్ చేసిన గ్యాంగ్ ను వెంబడించి పట్టుకొని వారి ప్రాణాలు రక్షించే వారని, కానీ అలా జరగలేదని నిర్లక్ష్యంగా వ్యవహరించడంతోని హంతకులకు అడ్డు అదుపు లేకుండా పోయిందని యదేచ్ఛగా రాజశేఖర్ ను పథకం ప్రకారం మట్టుపెట్టారని సంగమేశ్వర్ ఆవేదన వ్యక్తం చేశారు. ప్రముఖుల ఇంట్లో చిన్న కుక్క పిల్ల తప్పిపోతే హడావిడి చేసే వారు ఒక నిండు ప్రాణాన్ని బలి తీసుకునేందుకు కిడ్నాప్ చేస్తే పట్టించుకోకపోవడం ఇలాంటి ధర్మం అవుతుందని ప్రశ్నించారు. తను మాట్లాడే మాటలలో ఎంతో వాస్తవం ఉందని ప్రముఖులను కిడ్నాప్ చేస్తే మొత్తం అధికార



యంత్రాంగం కదిలిపోతుందని మీడియాలో హల్చల్ మొదలవుతుందని కానీ సామాన్యుల విషయంలో ఎలాంటి విచారణలు త్వరగా తిన నిర్ణయాలు ఉండవని ప్రముఖుల ప్రాణాల సామాన్యులవి ప్రాణాలు కావాలని సంఘమేశ్వర్ ప్రశ్నించారు. రాజశేఖర్ హత్య నేపథ్యంలో బాధ్యులైన వారిని వెంటనే పట్టుకుని జైలుకు పంపాలని అదేవిధంగా దీనిపై నిర్లక్ష్యం చేసిన పోలీసు అధికారులపై కూడా చర్యలు చేపట్టాలని సంగమేశ్వర్ ప్రకటన విడుదల చేశారు..

# దోషులను ప్రభుత్వం కఠినంగా శిక్షిస్తుంది

**షాద్ నగర్ కాంగ్రెస్ నాయకులు పి రఘు, మహ్మద్ అలీ ఖాన్ బాబర్, చెంది తిరుపతి రెడ్డి**

**దళితుల రక్షణకు ప్రభుత్వం అన్ని చర్యలు**

**రాజశేఖర్ కుటుంబానికి ప్రభుత్వం పూర్తి న్యాయం చేస్తుంది**

**సామాన్యుడి అస్త్రం షాద్ నగర్ :** ఎల్లంపల్లి గ్రామ దళిత యువకుడు రాజశేఖర్ హత్య జరిగిన సంఘటనలో దోషులను ఇంతటివారినైనా ప్రభుత్వం కఠినంగా శిక్షిస్తుందని ప్రభుత్వం ఎవరిని ఉపేక్షించబోధని కాంగ్రెస్ గిరిజన రాష్ట్ర కోఆర్డినేటర్ పి రఘునాయక్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మహమ్మద్ అలీ ఖాన్ బాబర్, పట్టణ సీనియర్ నాయకులు చెంది తిరుపతి రెడ్డి స్పష్టం చేశారు. సోమవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో వారు పేర్కొంటూ.. ఎల్లంపల్లి దళిత రాజశేఖర్ హత్య సంఘటనలో కొందరు ప్రజాసంఘాలు అదేవిధంగా మరికొందరు మాట్లాడుతున్న తీరు సమంజసంగా లేదని ఆక్షేపించారు. బాధ్యత గల ప్రభుత్వం కేసు విచారణలో పోలీస్ శాఖ అధికారులు అన్ని చర్యలు తీసుకుంటున్నారని గుర్తు చేశారు. ఈ సంఘటనపై స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పోలీసు అధికారులతో ఎప్పటికప్పుడు సంఘటన గురించి ఆరా తీశారని బాధితులకు పూర్తి న్యాయం జరిగేందుకు వారి పక్షాన నిలబడతారని రఘునాయక్ స్పష్టం చేశారు. ఇలాంటి సంఘటనలు జరిగినప్పుడు ప్రభుత్వం అన్ని కోణాల్లో ఆలోచిస్తుందని ముఖ్యంగా దోషులు ఎవరైనా వదిలిపెట్టే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. నేరస్తులను చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకునే విధంగా ఉంటుందని అన్నారు. జరిగిన సంఘటన పట్ల వారు ఆవేదన వ్యక్తం చేశారు. సమాజంలో ఇలాంటి ఘటనలు సరికావనీ ముఖ్యంగా సమాజంలో ఎంతో అభివృద్ధి మార్పు జరుగుతోందని అయినప్పటికీ ఇంకా కుల దురహంకార కుమ్ములాటలో బందీలు కావడం సరైన చర్య కాదని సమాజంలో అందరూ కలిసిమెలిసి జీవించాల్సిన అవసరం ఉందన్నారు. సంఘటన జరిగినప్పుడు అన్ని కోణాల్లో దర్యాప్తు జరుగుతుందని అలాంటి సమయంలో కొందరు అదేపనిగా ప్రభుత్వంపై అదే విధంగా ప్రజాప్రతినిధులపై విమర్శలు చేయడం పనిగా పెట్టుకోవాల్సిన అవసరం లేదన్నారు. సామాన్యుడికైనా ప్రముఖుడికైనా ఎమ్మెల్యేకైనా ముఖ్యమంత్రి కైనా ఎవరికైనా ఒకటే చట్టం వర్తిస్తుందని వారు పేర్కొన్నారు. రాజశేఖర్ కిడ్నాప్ ఘటన తర్వాత జరిగిన పరిణామాలు తదితర ఘటనల నేపథ్యంలో కొందరు ఎమ్మెల్యేలను కూడా కిడ్నాప్ చేస్తే ఇలాగే స్పందిస్తారా? అని అతిగా స్పందించడం సరికాదని వారు హితవు పలికారు. ఏదైనా సంఘటన జరిగినప్పుడు మానవతా దృక్పథంతో ముందుగా ఆలోచించాలని ఆ తర్వాత చట్టం తన పని తాను చేసుకోబోతుందని ఈ సంఘటనలో దోషులు ఎవరైనా



ఎంతటి వారైనా వదిలిపెట్టే ప్రసక్తే ఉండదని ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటుందని దళితులకు అండగా నిలబడుతుందని బాయిత కుటుంబానికి న్యాయం జరుగుతుందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కూడా వారి కుటుంబానికి న్యాయం చేస్తారని వారు స్పష్టం చేశారు..

# అయ్యప్ప భక్తులకు అన్నసంతర్పణ సేవాభావంతో మెరవిన గిరిజన సహకార సంస్థ చైర్మన్ కిడారి శ్రావణ్ కుమార్

**సామాన్యుడి అస్త్రం అల్లూరి :** అయ్యప్ప మాలధారణ చేసి పాదయాత్రకు సిద్ధమవుతున్న భక్తులకు సేవ చేయడం అంటే భక్తి సేవకే ప్రతిరూపమని చాటి చూపుతూ గిరిజన సహకార సంస్థ చైర్మన్ కిడారి శ్రావణ్ కుమార్ అన్నసంతర్పణ కార్యక్రమంలో విశేషంగా పాల్గొన్నారు. పాడేరు పట్టణంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆయన భక్తులకు స్వయంగా అన్నప్రసాదం వడ్డించి సేవాభావంతో అందరినీ ఆకట్టుకున్నారు.

**భక్తి, సేవలకు ప్రతీకగా శ్రావణ్ కుమార్ పాత్ర**

కార్యక్రమానికి ముందుగా స్థానిక అయ్యప్ప స్వామి దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన శ్రావణ్ కుమార్, దేవుడి దర్శనం తీసుకుని భక్తుల యాత్ర విజయవంతంగా సాగాలని సంకల్పించారు. భక్తులుతో మాట్లాడిన ఆయన “అయ్యప్ప మాలధారణ అనేది కేవలం ఆచారం మాత్రమే కాదు నియమం, నియంత్రణ, సేవ, శ్రద్ధలకు ప్రతీక” అని పేర్కొన్నారు. భక్తులు అనుసరించే నియమాచారాలు సమాజానికి ఆదర్శమని అన్నారు.



**అన్నసంతర్పణకు ప్రత్యేక విరాళం**

భక్తుల సేవలో భాగంగా శ్రావణ్ కుమార్ అన్నసంతర్పణ కోసం ప్రత్యేకంగా విరాళం అందజేశారు. పాదయాత్ర చేపట్టే భక్తులకు ఆహారం అందించడం గొప్ప పుణ్యకార్యం అని, ఈ సేవలో పాల్గొనడం తనకు ఆనందంగా ఉందని తెలిపారు.

**ప్రజాభిమానంతో నిండిన కార్యక్రమం**

ఈ కార్యక్రమంలో స్వాములు సునీల్, నాయుడు, ఉదయ్,



అలాగే టీడీపీ నాయకులు భవాని, రాము, సాగర, సుబ్బారావు, పాండు రంగ స్వామి, మురళి, అచ్చిబాబు, కళావతి, ద్రౌపతి, మహేష్, ఆదిత్య, దామోదర్ రాజు తదితరులు పాల్గొని భక్తులకు సేవలందించారు. స్థానిక భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. అన్నసంతర్పణ కార్యక్రమం ఆధ్యాత్మిక వాతావరణంలో సాగి భక్తుల ప్రశంసలు పొందింది.

## జొన్నాడ గ్రామం లో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కోటి సంతకాల సేకరణ రచ్చబండ కార్యక్రమం

**జొన్నాడ గ్రామం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ పార్టీ ప్రెసిడెంట్ తాడి శ్రీనివాస్ రెడ్డి, అధ్యక్షతన గ్రామంలో కోటి సంతకాల సేకరణ కార్యక్రమాలు.**

**జొన్నాడ గ్రామం:**

**సామాన్యుడి అస్త్రం కోనసీమ :** ఆలమూరు మండలం లో ఈ రోజు ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి మరియు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు జగన్మోహన్ రెడ్డి మరియు వైయస్సార్సీపి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అధ్యక్షులు చిర్ల జగ్గిరెడ్డి ఆదేశాలు మేరకు ఆలమూరు మండలం జొన్నాడ గ్రామం లో నేడు రచ్చబండ కార్యక్రమాలు,కోటి సంతకాల సేకరణ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన మండల కన్వీనర్ తమ్మన శ్రీనివాస్,తోరాటి రాంబాబు మరియు ఎంపీపీ తోరాటి లక్ష్మణరావు,నామాల శ్రీనివాస్ , మాజీ చైర్మన్ యనమదల నాగేశ్వరరావు నియోజవర్గ బూత్ కన్వీనర్ పెంటపాటి వెంకన్న, నెల్లి రాజు, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ జొన్నడ గ్రామ ప్రెసిడెంట్ తాడి శ్రీనివాస్ రెడ్డి, కట్ట శ్రీనివాస్ గ్రామ ప్రెసిడెంట్, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ జనరల్ సెక్రెటరీ నాగ మోహన్ రెడ్డి, తాడి మెహర్ ఆదిత్య రెడ్డి సత్య ప్రదీప్ రెడ్డి ,ఆనం వెంకన్న, భీమేష్, సూర్యనారాయణ 14 వార్డ్ మెంబర్, 13 వార్డు మట్ట శీను, తాడి మధుసూదన్ రెడ్డి 5 వార్డు, ద్వారంపూడి ఇంద్రారెడ్డి, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఇంటలెక్చువల్ ఫరం కార్యదర్శి కొడమంచిలి హరీష్, కాలా విజయకుమార్ తోరాటి గోవింద్, కుమార్ రాజా సామకూరి శ్రీను,నియోజక వర్గ గ్రీవెన్ విభాగం నవతా ప్రసాద్, గుంటూరు గోవింద్, ద్వారంపూడి దొరబాబు మోతుకూరు మాజీ సొసైటీ చైర్మన్ గ్రామ కమిటీ అధ్యక్షులు తోట కొండయ్య, తోరాటి గోవిందు, సత్యనారాయణ జయ రాజు, కాలి శ్రీనూ, భీమ శంకరం , ఉండమట్ల శ్రీను నాయకులు ఈ యొక్క కోటి సంతకాల సేకరణ రచ్చబండ కార్యక్రమంలో తదితరులు పాల్గొన్నారు.



## జనగామ అమ్మ క్యాంటీన్



**సామాన్యుడి అస్త్రం జనగామ** సముద్రాల హర్షిని పుట్టినరోజు సందర్భంగా తల్లిదండ్రులు సముద్రాల సందీప్ గౌతమి జనగామ జిల్లా ఆసుపత్రి వద్ద వైద్యం కోసం వచ్చిన ప్రజలకు ఒక పూట ఆకలిని తీర్చి ఘనంగా తమ కూతురు జన్మదిన వేడుకలు జరిపించారు ఈ సందర్భంగా జనగామ అమ్మ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంతెన మణికుమార్ ప్రధాన కార్యదర్శి వంగ భీమ్ రాజు మాట్లాడుతూ ఈరోజు పుట్టినరోజు జరుపుకుంటున్న సముద్రాల హర్షిని చిట్టితల్లికి అమ్మ ఫౌండేషన్ టీం తరఫున జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు ప్రతి ఒక్కరు ప్రజలు వారి పుట్టినరోజు వేడుకలు సందర్భంగా నిరుపేద కుటుంబాలకు నిరాశ్రయులకు అనాధలకు ఒక పూట ఆకలి తీర్చి జరుపుకోవాలని భారత దేశంలో ఆకలి చావులు లేకుండా నియంత్రణ లక్ష్యంగా భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు మీసేవ కార్యక్రమంలో అమ్మ ఫౌండేషన్ వైస్ ప్రెసిడెంట్ రవి బింగి నరసింహులు ఉల్లెంగుల మణి వెంగళ వరుణ్ అప్పు విశ్వదాతను పాల్గొన్నారు

## మోతుకూరు గ్రామం లో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కోటి సంతకాల సేకరణ రచ్చబండ

**మోతుకూరు గ్రామం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ పార్టీ ప్రెసిడెంట్ పెంటపాటి వెంకన్న, అధ్యక్షతన గ్రామంలో కోటి సంతకాల సేకరణ కార్యక్రమాలు.బి**

**సామాన్యుడి అస్త్రం కోనసీమ :** ఆలమూరు మండలం లో ఈ రోజు ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి మరియు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు జగన్మోహన్ రెడ్డి మరియు వైయస్సార్సీపి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అధ్యక్షులు చిర్ల జగ్గిరెడ్డి ఆదేశాలు మేరకు ఆలమూరు మండలం గుమ్మిలేరు, మోదుకూరు గ్రామాల్లో రక్షబండ కార్యక్రమాలు,కోటి సంతకాల సేకరణ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన



మండల కన్వీనర్ తమ్మన శ్రీనివాస్,తోరాటి రాంబాబు మరియు ఎంపీపీ తోరాటి లక్ష్మణరావు,నామాల శ్రీనివాస్ , మాజీ చైర్మన్ యనమదల నాగేశ్వరరావు ,లంక ముత్యాల రావు, పంచాయతీ వైస్ ప్రెసిడెంట్ గోదితి దొరబాబు,కోదుకూరి కాంతి కుమార్, తాతపూడి రాంబాబు, తాతపూడి సన్నీ నియోజవర్గ బూత్ కన్వీనర్ సల్ల సుబ్బయ్య,గుమ్మిలేరు సర్పంచ్ గుణ్ణం రాంబాబు , పెంటపాటి వెంకన్న, నెల్లి రాజు, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఆలమూరు మండల సెక్రెటరీ ఒరిగిడి సుధాకర్ . వైయస్సార్ వైసీపీ పెనికేరు పార్టీ ప్రెసిడెంట్ గుత్తుల జయరాజ్ తోరాటి గోవింద్, కుమార్ రాజా సామకూరి శ్రీను,నియోజక వర్గ గ్రీవెన్ విభాగం నవతా ప్రసాద్, గుంటూరు గోవింద్, ద్వారంపూడి దొరబాబు మోతుకూరు మాజీ సొసైటీ చైర్మన్ గ్రామ కమిటీ అధ్యక్షులు తోట కొండయ్య, తోరాటి గోవిందు, సత్యనారాయణ జయ రాజు, కాలి శ్రీనూ, తాడి శ్రీనివాసరెడ్డి,భీమ శంకరం , ఉండమట్ల శ్రీను నాయకులు ఈ యొక్క కోటి సంతకాల సేకరణ రచ్చబండ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## మునిసిపల్ స్కూల్ టీచర్ కావేరి నీ ప్రశంసిస్తూ నారా లోకేష్ ట్వీట్...



**సామాన్యుడి అస్త్రం కోనసీమ :** మండపేట పెద్ద గొల్లపుంత లోని శారద మునిసిపల్ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయురాలు అమలదాసు కావేరి నీ అభినందిస్తూ రాష్ట్ర విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ తన ట్విట్టర్ ఖాతాలో అభినందించారు.ఎస్ జి టి సింగల్ టీచర్ గా పని చేస్తున్న కావేరికి అభినందనలు తెలుపుతూ మంత్రి లోకేష్ ట్వీట్ చేశారు. జీరో గా ఉన్న విద్యార్థుల సంఖ్యను 11 కు చేర్చిన కావేరిని అభినందించారు. రీల్స్ తయారుచేసి సోషల్ మీడియా ద్వారా ప్రచారం చేయడం ప్రశంసనీయమని కొనియాడారు. చిన్నారుల వయసు ఆలోచనకి తగ్గట్లు వినూత్నమైన బోధనా పద్ధతులతో పాఠాలు చెబుతున్న తీరు చాలా బాగుందని మెచ్చుకున్నారు. ఆటపాటలతో చదువు నేర్పిస్తూ నైతిక విలువలు సాంస్కృతిక సాంప్రదాయాలు దేశభక్తిని బోధించడం చాలా సంతోషమని పేర్కొన్నారు. రీల్స్ తయారుచేసి సోషల్ మీడియా ద్వారా ప్రచారం చేయడం ప్రశంసనీయమని కొనియాడారు. పర్యావరణ పరిరక్షణ లక్ష్యంగా కిచెన్ గార్డెన్ అభివృద్ధి చేసిన ఆమె కృషి చాలామందికి స్ఫూర్తినిస్తుందని పేర్కొన్నారు. లోకేష్ ట్వీట్ తో సర్వత్రా చర్చనీయాంశం గా మారింది. నెటిజన్ లు రీల్స్ లో ఆ పాఠశాల పేరు సెర్చ్ చేస్తున్నారు.

## హాస్టల్ వార్డెన్స్ నిర్లక్ష్యంపై ఫిర్యాదు చేసిన మాజీ జడ్పిటిసి పాల్వంచ దుర్గ

**- ఆహార నాణ్యత, భోజన సదుపాయం కూడా పేలువంగా**

**- ప్రభుత్వ హాస్టలను అధికారులు తనిఖీ చేయ్యాలి**



**సామాన్యుడి అస్త్రం మణుగూరు, :** ప్రభుత్వ హాస్టల్లో పనితీరు సక్రమంగా లేదని మాజీ జెడ్పిటిసి పాల్వంచ దర్గా ఐటీడీఏ భద్రాచలం ప్రాజెక్ట్ ఆఫీసర్ కు, సబ్ కలెక్టర్ కు ఫిర్యాదు చేశారు. సామాజిక కార్యకర్త, న్యాయవాది కర్నే రవి ప్రభుత్వ హాస్టల్స్ ను తనిఖీ చేస్తే పలు విషయాలు బయటపడ్డాయని ఆమె తెలిపారు. హాస్టల్ వార్డెన్లు రోజువారీగా విధులు నిర్వహించడం లేదని, విధులకు గైర్హాజరు అవుతున్నారని తెలిపారు. హాస్టల్ విద్యార్థుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని అన్నారు. వార్డెన్ లో నిర్లక్ష్యంతో ప్రభుత్వ హాస్టల్లో కుంటుపడుతున్నాయని పాల్వంచ దుర్గ వాపోయారు. ఎప్పటికప్పుడు ప్రభుత్వ అధికారులు హాస్టల్లో తనిఖీ చేస్తూ మెరుగైన విద్య, విద్యార్థులకు అందేలా చూడాలని ఆమె ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వార్డెన్ విధుల పట్ల నిర్లక్ష్యం వహించిన వారి పట్ల కట్టిన చర్యలు తీసుకోవాలన్నారు. ఆహార నాణ్యత భోజన సదుపాయాలు కూడా పేలవంగా మారాయి అపేలవంగా మారాయన్నారు. హాస్టల్ వార్డెన్ లు అనుసరిస్తున్న తీరుపై భద్రాచలం ఐటిడిఏ అధికారి, సబ్ కలెక్టర్ కు ఫిర్యాదు చేశారు.

# భలే.. కృష్ణుడి కమనీయ గానాల విందు.. ఆద్యంతం భలే పసందు..

**అలరించిన సూపర్ స్టార్ కృష్ణ పాటల గానామృతం..**
**ప్రత్యేకంగా నిలిచిన గాయనీ గాయకుల పాటలు..**
**శ్రీ సరస్వతి కళాపీఠం ఆధ్వర్యంలో కార్యక్రమం..**
**సూపర్ స్టార్ కృష్ణకు ఘన నివాళి..**
**ముఖ్య అతిథులుగా ఎండి ఖాదర్ గోరి, దిడ్డి రాంబాబు, ప్రొడ్యూసర్ సిరాజ్, కృష్ణ అభిమానులు**
**ఎస్.ఎస్.కే.పి అధినేత్రి మధిర రోజా తదితరుల ఆధ్వర్యంలో కార్యక్రమం..**
**డొక్కా సీతమ్మ సినిమాలో "రోజా మదిర"కు పాట పాడే అవకాశం కల్పించిన ప్రొడ్యూసర్స్ సిరాజ్, ఖాదర్ గోరి**





**సామాన్యుడి అస్త్రం షాద్ నగర్ :** ఘణా ఘన సుందరా అంటూ భక్తిపారవశ్యంలో ముంచెత్తారు.. నమస్తే సుస్వాగతం.. అంటూ అభిమానులను ఆహ్వానించారు.. విశాల గగనంలో చందమామను చూస్తూ.. చుక్కల తోటలో విహరింప చేశారు.. చాంగు భళా బాగుంది కదా తమ జోరు.. అంటూ అభిమానులు మెచ్చేలా.. వందనాలు.. వందనాలు అంటూ ప్రేక్షకులు చప్పట్లు కొట్టేలా సాగిన సూపర్ స్టార్ "భలే కృష్ణుడి" గానామృతం ఆద్యంతం కన్నుల విందు చేసింది.. శ్రీ సరస్వతి కళాపీఠం (ఎస్.ఎస్.కే.పి) ఆధ్వర్యంలో నిర్వాహకులు ఈలపాట గాన కోకిల రోజా మధిర, ఎంవిజీవి రావు దంపతుల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సూపర్ స్టార్, నట శేఖర్ కృష్ణ సినిమాలోని అద్భుతమైన పాటలను కళాకారులు ఆవిష్కరించారు. ప్రముఖ ఈల గాయనీయమని రోజా మధిర, కళాకారుడు, గాయకుడు జర్నలిస్టు ఎం.డి ఖాజాపాషా (కేపీ)తోపాటు రత్న కుమారి, రమణి, మాధవి, శ్రీరాణి, చందన, జనశ్రీ రెడ్డి, రామానంద, ప్రసాద్, కృష్ణ విహారి, మోహన్, ప్రణయ్, చిరంజీవి, క్రాంతి, ప్రేమ్ రాజ్, ట్రాక్ సుదర్శన్ తదితరులు ఆలపించిన పాటలు ఎంతగానో అలరించాయి. ముందుగా సూపర్ స్టార్ కృష్ణకు నివాళు లు అర్పించిన ముఖ్య, విశిష్ట అతిథులు కృష్ణ మహేష్ ప్రజా సేన ఆల్ ఇండియా అధ్యక్షులు ఎండి ఖాదర్ గోరి, మరో సీనియర్ అభిమాని మాజీ కార్పొరేటర్ దిడ్డి రాంబాబు, డొక్కా సీతమ్మ సినీ ప్రొడ్యూసర్ సిరాజ్, పద్మాలయ స్టూడియో పిఆర్ఓ శర్మ, విజయవాడ బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు భావనారాయణ, విశిష్ఠాథితులు పరుచూరి విజయలక్ష్మి, విదుషిమని ప్రసూన ఇంకా హైదరాబాద్, సికింద్రాబాద్ ప్రాంతాల నుండి కృష్ణ ముఖ్యమైన అభిమానులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. సినీ రంగానికి సూపర్ స్టార్ కృష్ణ ఆయన చేసిన సేవలను, సినీ రంగంలో ఆయన సాహసాలను కొనియాడారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆల్ ఇండియా కృష్ణ ప్రజాసేన అధ్యక్షులు ఎండి ఖాదర్ గోరి మాట్లాడుతూ చిన్నతనం నుండి సూపర్ స్టార్ కృష్ణ గారు అంటే తనకు ఎంతో అభిమానం అని, ఆయన పాటలు ఎన్నిసార్లు విన్న పరవశించి పోతుంటానని అన్నారు. కృష్ణ 3వ వర్ధంతిని పురస్కరించుకొని ఇంత మంచి కార్యక్రమానికి శ్రీకారం చుట్టడం తనకు ఎంతో సంతోషాన్ని ఇచ్చిందని ఆయన అన్నారు. హీరో కృష్ణ పాటలను ఆలపించిన ప్రతి ఒక్కరిని ఆయన మనస్ఫూర్తిగా అభినందించారు. శ్రీ సరస్వతి కళాక్షేత్రం నిర్వాహకురాలు త్రిబుల్ ఆర్ఎం లకు ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ముందుగా సూపర్ స్టార్ కృష్ణకు రెండు నిమిషాలు మౌనం పాటించి శ్రద్ధాంజలి ఘటించారు అనంతరం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.

**ఈ పాటలూ.. పంచామృతమే..**

హీరో కృష్ణ గారి పాటలు మాత్రమే కాకుండా ఇతర పాటలతో కూడా కెపి అలరించారు. ఇతర గాయని మణులు కూడా ఆయా పాటలకు తమ గాత్రాన్ని అందించారు. శ్రీరాణి కలిపి పాడిన సూపర్ స్టార్ కృష్ణ పాటలు ఎంతగానో అలరించాయి. గాయని గాయకులు అనేక పాటలు పాడి ఆకట్టుకున్నారు. అదేవిధంగా సోలోగా ముద్దమందారం సినిమాలోని ముద్దుకే ముద్దొచ్చే మందారం.. అనురాగ దేవత నీవే, నవ్వుతూ బతకాలి రా తమ్ముడు పాటలతో పాటు ప్రసాద్ పాడిన నా పేరు బికారి, వంటి పాటల ద్వారా ఆకట్టుకున్నారు. నాలుగు దశాబ్దాలకు పైగా తెలుగు సినీ రంగానికి సేవలు అందించి ఉన్నత స్థాయికి తీసుకువెళ్లిన సూపర్ స్టార్ కృష్ణకు గాన కళాకారులంతా కలిసి ఆయన పాటల రూపంలో ఇచ్చిన ఘన నివాళి ఓ మధురానుభూతిగా మిగిలిపోతుంది అనడంలో ఎలాంటి సందేహం లేదు.

**డొక్కా సీతమ్మలో రోజా మధిరకు ఛాన్స్**

కార్యక్రమానికి హాజరైన డొక్కా సీతమ్మ సినిమా ప్రొడ్యూసర్స్ సిరాజ్, ఎండి ఖాదర్ గోరిలు రోజా మధిరకు ఒక పాట పాడే అవకాశాన్ని కల్పిస్తున్నట్లు కార్యక్రమంలో ప్రకటించారు. సూపర్ స్టార్ కృష్ణ గారి పాటలను ఎంతో అద్వితీయంగా పాడి ఆయనకు అంకితం చేయడం వర్ధంతి సందర్భంగా ఆయన సేవలను గుర్తు చేసుకోవడం ఎంతగానో నచ్చిందని శ్రీ సరస్వతి కళా పీఠం నిర్వాహకులకు వారు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. ఎల్లప్పుడు శ్రీ సరస్వతి కళా పీఠానికి కృష్ణ మహేష్ ప్రజాసేన సంఘం తరఫున సహాయ సహకారాలు అందిస్తామని ప్రకటించారు. తమ నిర్మిస్తున్న డొక్కా సీతమ్మ సినిమాలో రోజా మదిరకు ఒక పాట పాడే అవకాశాన్ని కల్పిస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా జర్నలిస్టు కేపీకి, రోజా మధిరకు రాబోయే తదుపరి చిత్రాలలో నటనకు అవకాశం కల్పిస్తామని తెలిపారు.

**పాటల పూతోటలో ఎస్.ఎస్.కే.పి బృందం..**

ఏ పాట పాడిన తన అద్భుతమైన గానంతో అలరించడం గాయని గాయకుల ప్రత్యేకత. అలాంటిది ఎంతగానో ప్రజలు అభిమానించే సూపర్ స్టార్ కృష్ణ పాటలు అంటే ఇంకా వేరే చెప్పాలా.. ప్రతి పాటతో తమదైన శైలిలో మ్యాజిక్ పై గాన బృందంతో కలిసి అభిమానులను అలరించారు. కార్యక్రమంలో భాగంగా అందరూ ఎంచుకున్న పాటలు కూడా కృష్ణ కెరియర్ లోనే ఆల్ టైం హిట్స్. ముందుగా భక్తతుకారం సినిమాలోని ఘణా ఘన సుందర భక్తి పాటతో మొదలుపెట్టిన తరువాత కిరాయి కోటిగాడు సినిమాలోని నమస్తే సుస్వాగతం పాటతో హీరో కృష్ణ పాటలకు శ్రీకారం చుట్టారు. గాయని రోజాతో కలిసి ఈ పాటను ఆలపించారు. ఇక తర్వాత మహాబలుడు సినిమాలోని విశాల గగనంలో చందమామ పాటను గాయని రత్న కుమారితో కలిసి ఆలపించారు. గాయని మాధవి తో కలిసి కురుక్షేత్రం సినిమాలోని మ్రోగింది కళ్యాణ వీణ, పచ్చని కాపురం సినిమాలోని వెన్నెలైనా చీకటైనా.. చుట్టాలున్నారు జాగ్రత్త సినిమాలోని రెక్కలు తొడిగి రెపరెపలాడి.. నెంబర్ వన్ సినిమాలోని సాంగ్ చాంగ్ భళా బాగుంది కదా తమ జోరు.. ఏజెంట్ గోపి చిత్రంలోని హంస భలే రామచిలక ఓలమ్మి.. మాటలతో ఆకట్టుకున్నారు. శ్రీరాణితో కలిసి చుక్కల తోటలో ఎక్కడున్నావో పాటతో పాటు సింహాసనం చిత్రంలోని వాహ్వా నీ యవ్వనం.. ప్రజారాజ్యం చిత్రంలోని గోపాలుడు వస్తే గోపెమ్మ నవ్వే.. వంటి పాటలు పాడారు.. ఆకాశంలో ఒక తార రోజా మధిరతో పాడగా అదే విధంగా ఇలా గానంతో అన్నదమ్ముల సవాల్ నాకోసమే నీవున్నది పాట అలరించారు. ఇక సోలోగా కుమార రాజా సినిమాలోని అనురాగ దేవత నీవే.. మాయదారి మల్లిగాడు సినిమాలోని నవ్వుతూ బ్రతకాలి రా.. పాటలతో దుమ్మురేపారు. ఈ సందర్భంగా శ్రీ సరస్వతి కళా పీఠం తరఫున ముఖ్య అతిథులకు శాలువాలతో ఘనంగా సన్మానం చేశారు అదేవిధంగా గాయని గాయకులకు ఎండి ఖాదర్ గోరి ప్రత్యేక సన్మానాలు చేసి అభినందించారు..

## సిఐటియు జిల్లా మహాసభల విస్తృత ప్రచారం

**సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు గద్దల శ్రీనివాసరావు**



**సామాన్యుడి అస్త్రం మణుగూరు, :** సిఐటియు జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని సిఐటియు మండల కమిటీ ఆధ్వర్యంలో మణుగూరు పట్టణంలో సోమవారం విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. సమరశీల పోరాటాల చరిత్ర గలిగిన సిఐటియు కరపత్రాన్ని ఇంటింటికి పంపిణీ చేశారు. ప్రతి షాపులో యజమానులకు వివరిస్తూ మహాసభలను జయప్రదం చేయాలని విరాళాలు సేకరించారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు గద్దెల శ్రీనివాసరావు మాట్లాడుతూ సిఐటియు జిల్లా మహాసభలను జయప్రదం చేసేందుకు ప్రజలు, పుర ప్రముఖులు హార్దిక, ఆర్థిక సహాయ సహకారాలు అందించాలని పిలుపునిచ్చారు. బొగ్గు ఉత్పత్తి ఉత్పాదికతలలో 11 డివిజన్ లలో అగ్రగామిగా వెలుగొందిన మణుగూరు సింగరేణి ఏరియా ప్రమాదంలో పడింది అన్నారు. సింగరేణి పరిరక్షించేందుకు జిల్లా సిఐటియు మహాసభలలో సమరశీల పోరాటాలకు రూపకల్పన చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కమిటీ సభ్యుడు సత్రపల్లి సాంబశివరావు, వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి పిట్టల నాగమణి, ఐద్వా మండల కార్యదర్శి తోట పద్మ, గిరిజన సంఘం మండల అధ్యక్షురాలు కోంద్రు గౌరీ, సిఐటియు నాయకుడు నైనారపు నాగేశ్వరరావు, బండారు సారిక, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు మాదాసు అఖిల్ ,తదితరులు పాల్గొన్నారు.

## టీఎస్ యుటిఎఫ్12వ.మండల మహాసభలను విజయవంతం చేయండి

**జిల్లా కార్యదర్శి డిఎస్.నాగేశ్వరరావు**




**సామాన్యుడి అస్త్రం వైరా :** ఏన్కూర్ ఈనెల 19 తారీకు బుధవారం నాడు స్థానిక మండల కేంద్రంలోని బాలుర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఏన్కూర్ పాఠశాల కూరపాటి పాండురంగయ్య ప్రాంగణంలో నిర్వహించబోతున్న తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టిఎస్ యుటిఎఫ్) ఏన్కూర్ మండల శాఖ12వ. మహాసభలను విజయవంతం చేయాలని జిల్లా కార్యదర్శి డిఎస్. నాగేశ్వరరావు ఉపాధ్యాయులను కోరారు. మండల అధ్యక్షులు బానోత్ రామచంద్ అధ్యక్షతన జరిగిన మండల కమిటీ సమావేశంలో వారు పాల్గొని మాట్లాడుతూ మహాసభకు ఉపాధ్యాయులు,సంఘ సభ్యులు,కార్యకర్తలు, శ్రేయోభిలాషులు అధిక సంఖ్యలో హాజరై కమిటీ పనితీరుపై చర్చించాలని, భవిష్యత్ కర్తవ్యాలను నిర్ణయించుకోవాలని, ఉపాధ్యాయులకు మంచి సర్వీస్ అందిస్తూ ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణకు ఎల్లవేళల కృషి చేయాలని అందుకు అనుగుణంగా ప్రణాళికలు రూపొందించుకోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి మూడ్ పుల్లయ్య,ఉపాధ్యక్షులు జె. పుల్లయ్య,శ్రీదేవి, రాఘవరావు,నరసింహారావు,శంకర్రావు,నాగేశ్వరరావుశ్యాం కుమార్, సింగ్యా, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## స్నేహభావంతో మెలగడానికి ఉపయోగపడతాయి

**మున్నూరు కాపుల వన సమారాధనలో శెట్టి రంగారావు**





సామాన్యుడు అస్త్రం వైరా : ఐక్యత స్నేహభావంతో మెలగడానికి వన సమారాధనలు ఉపయోగపడతాయని మున్నూరు కాపు పటేల్స్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ శక్తి రంగారావు అన్నారు. ఆదివారం మండలంలో మున్నూరు కాపు వన సమారాధన ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా మున్నూరు కాపు పటేల్స్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ శెట్టి రంగారావు మరియు సీనియర్ మున్నూరు కాపు నాయకులు కనకం జనార్ధన్ పాల్గొని మాట్లాడుతూ ఉత్సాహపూరిత వాతావరణంలో మున్నూరు కాపులంత ఏకమయ్యి ఐక్యతతో స్నేహ భావంతో మెలగడానికి ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయని అన్నారు.. ఈ కార్యక్రమానికి ఏన్కూర్ మండలం అధ్యక్షులు కొవ్వూరి నాగేశ్వరరావు అధ్యక్షత వహించారు. తలుతా మహిళలంతా కార్తీక మాసం సందర్భంగా శివ పార్వతుల చిత్రపటానికి ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ బోర్డు కార్యదర్శి కనిశెట్టి నర్సయ్య, శెట్టిపల్లి వెంకటేశ్వరరావు, కాసిన్ని శ్రీనివాస రావు, అవుల నర్సయ్య, తోట రామచంద్రయ్య, పిన్ని వెంకట నారాయణ, పేలప్రోలు వరశంకర ప్రసాద్, ముదిగొండ నరసింహారావు, సైదులు, పాశం నరసింహారావు మరియు మున్నూరు కాపు ఏన్కూర్ మండల సోదరులు-సోదరీమణులు పాల్గొన్నారు.

# దారి తప్పిన ఇందిరమ్మ ఇళ్ల ఎంపిక

**కారం సమీనా ఎస్టీ/బీసీ నా**
**ఆధార్ కార్డు మారుస్తే కులం మారుతుందా???**
**ఐటిడిఏ ద్వారా ఆదివాసీలకు అందాల్సిన ఇల్లు, ముస్లిం మహిళకు కేటాయించిన అధికారులు**







**సామాన్యుడి అస్త్రం మణుగూరు :** ఐటిడిఏ ద్వారా ఇల్లు మంజూరు కొరకు అదనపు బడ్జెట్ కేటాయించి, గిరిజనులకి లబ్ధిచేకూరేలా ప్రణాళికనూ రూపొందించడం జరిగింది, అందులో భాగంగా మణుగూరు మండలంలోని ఇప్పల సింగారం పంచాయతీ పరిధిలో ఐటిడిఏ ద్వారా 11ఇల్లు మంజూరు కాగా అందులో ఒకటి కారం సమీనా పేరు మీద ఇల్లు మంజూరు చేయడం జరిగింది. ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలంటే ప్రభుత్వం కొన్ని నియమ నిబంధనలు పెట్టగా, ఇందిరమ్మ కమిటీ మరియు ప్రభుత్వ అధికారుల లోపంతో ఆదివాసులకి కేటాయించాల్సిన ఇల్లునూ, ఆదివాసీ ఇంటి పేరుతో ఉన్న ముస్లిం (బీసి) మహిళకూ కేటాయించడంతో, ఎన్నో ఏళు ్లగా సొంత ఇంటి నిర్మాణం కోసం ఆశగా ఎదురు చూస్తున్న అసలైన ఆదివాసులకు తీరని అన్యాయం జరిగింది.

**ఇందిరమ్మ కమిటీ వారి అవగాహన లోపమా, అధికార అహంకారమా!**

ఇందిరమ్మ ఇల్లు, ఇల్లు లేని నిరుపేదలకు కేటాయించాలని ప్రభుత్వం చెబుతుండగా, ఇందిరమ్మ ఇండ్ల కమిటీ వారు అవేమి పట్టించుకోకుండా వారికి ఇష్టమైన వారికి కేటాయిస్తూ అసలైన నిరుపేదలకు మొండి చేయి చూపిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల ప్రకారం ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపికలో ఈ కమిటీలదే కీలక పాత్ర. కమిటీ ఆమోదంతోనే లబ్ధిదారుల ఎంపిక మొదలు అవగాహన కార్యక్రమాలు, ఇండ్ల నిర్మాణంలో సలహాలు, సూచనలు, ఫైనల్గా సోషల్ ఆడిట్ను కూడా కమిటీలే పర్యవేక్షిస్తాయని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. అర్హులకు ఇండ్లు దక్కకపోవడం, అనర్హులకు ఇండ్లు వస్తే వాటిని అధికారుల దృష్టికి తీసుకురావాల్సిన బాధ్యత కూడా కమిటీలపై ఉంది. కానీ ఎంపిక దశలోనే కమిటీల్లో పారదర్శకత లోపించడంతో ఎంతవరకు కమిటీల లక్ష్యం నెరవేరుతుందన్న సందేహాలు నెలకొన్నాయి. కమిటీల్లో కాంగ్రెస్ నేతలే కీలకం కావడంతో ఇండ్లను కూడా వారి కార్యకర్తలకే వచ్చేలా చేస్తున్నారన్నది నిజం. దాంతో నిజమైన అర్హులకు ఇండ్లు దక్కకుండా వారికీ నచ్చిన వాళ్లకు ఇస్తున్నారు. దీనివల్ల అర్హులు ఈ పథకానికి దూరమయ్యే అవకాశాలు లేకపోలేదు. రాజకీయ కక్షతో అర్హులైన ఇతర పార్టీల్లోని పేదలకు, ఎవరితోనూ సంబంధం లేని సామాన్యులకు ఇండ్లను దక్కనియడం లేదు అనే సందేహాలు వెల్లువెత్తుతున్నాయి. ఇందిరమ్మ ఇండ్ల కమిటీల ఏర్పాటుపై గ్రామాల్లో తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నారు. ప్రతి పంచాయతీలో కూడా ఏకపక్ష జాబితాలపై గ్రామ ప్రజలు ఫిర్యాదు చేస్తున్నారు. పారదర్శకత లేకుండా ఎంపిక చేస్తున్న కమిటీలతో అర్హులకు న్యాయం ఎలా జరుగుతుందన్న ప్రశ్నలు వెల్లువెత్తుతున్నాయి.

**ఎంపిక విధానం**

ఎంపికలో అతిపేదలు, ఒంటరి మహిళలు, వితంతువులు, దివ్యాంగులకు ప్రాధాన్యం ఇస్తారు. పూరిగుడిసెలు లేదా పెంకుటిళ్ళలో నివసిస్తున్న వారికి ఇళ్లను నిర్మించి ఇస్తారు. గ్రామసభల ద్వారా అర్హులైన లబ్ధిదారుల జాబితాలను గుర్తిస్తారు. తుది జాబితాను గ్రామసభలో ప్రదర్శించి, అభ్యంతరాలను స్వీకరిస్తారు. నియోజకవర్గాల వారీగా కలెక్టర్లు లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను పర్యవేక్షిస్తారు. కానీ గ్రామసభలే లేకుండా ఇష్టరాజ్యంగా కాంగ్రెస్ కమిటీకి నచ్చిన వారికే ఇచ్చుకుంటున్నారు. పొరపాటున ఒక పేరు కనపడిన తరువాత రోజు అది మాయం.

**ప్రభుత్వ అధికారుల పనితీరు ఇదేనా??**

ఇందిరమ్మ ఇల్లు కేటాయించాలంటే వారికి ఇల్లు ఉందా, ఖాళీ స్థలం ఉందా, వారు అర్హులా? కాదా?? వారి ఆధార్ కార్డు, వారి ఆదాయం ధ్రువీకరణ, రేషన్ కార్డ్, కులం ధ్రువీకరణ, అని అడుగుతూ అసలైన లబ్ధిదారునూ నానా ఇబ్బందులు చేసే అధికారులు, సమినా కూ కేటాయించిన ఇంటి విషయంలో ఇవేమి చూడకుండానే, పరిశీలన చేయకుండానే లబ్ధిదారులను ఏ విధంగా లబ్ధిదారులుగా గుర్తిస్తున్నారని ప్రజలు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు.

**ఎస్టీ కుల ధ్రువీకరణ పత్రం ఇచ్చిన తహసీల్దార్ పై చర్యలు తీసుకోవాలి**

కారం సమీనా కు ఎస్టీ కుల ధ్రువీకరణ పత్రం ఎలా ఇచ్చారు? పేరు లోనే ముస్లిం మహిళా అని తెలుస్తుంది. ఎటువంటి ఆధారాలు పరిశీలించకుండా కారం సమీనా కు ఎస్టీ కుల ధ్రువీకరణ పత్రం జారీ చేసిన తహసీల్దార్ పై ఉన్నత అధికారులు చర్యలు తీసుకోవాలి. ఇల్లు కేటాయించిన ప్రభుత్వ అధికారుల పైన అలాగే ఇందిరమ్మ ఇళ్ల కమిటీ పైన జిల్లా ఉన్నత అధికారులు చర్యలు తీసుకొవాలి.

# ఖమ్మం ఎంపీ రఘురాం రెడ్డి చొరవతో నాగులవంచ రైల్వే స్టేషన్ లో సౌకర్యాలు

**విజయవాడ- డోర్నకల్ ప్యాసింజర్ రైలు హాల్ట్ పునరుద్ధరణ**

**సామాన్యుడు అస్త్రం వైరా** : ఖమ్మం: పార్లమెంట్ సభ్యులు రామసహాయం రఘురాం రెడ్డి ప్రత్యేక చొరవతో నాగులవంచ రైల్వేస్టేషన్ లో ప్రయాణికుల సౌకర్యార్థం మౌలిక సదుపాయాలు సమకూరాయి. ఈ ప్రాంతం నుంచి తరచూ.. మధిర, ఖమ్మం, కొండపల్లి, విజయవాడ, హైదరాబాద్ లకు వివిధ పనుల మీద ప్రజలు, ఉన్నత విద్య కోసం విద్యార్థులు వెళుతుంటారని.. కనీస సౌకర్యాలు లేక ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారని ఎంపీ రఘురాం రెడ్డి రైల్వే జీఎం దృష్టికి గతంలో తీసుకెళ్లారు. నిజాం కాలం నాటి ఈ రైల్వే స్టేషన్ లో సౌకర్యాలు కల్పించాలని, పలు సర్వీసులను పునరుద్ధరించాలని విజ్ఞప్తి చేశారు. దీంతో స్పందించిన రైల్వే జీఎం సంజయ్ కుమార్ శ్రీవాత్సవ హుటాహుటిన పనులు చేయించారు. స్టేషన్ లో అదనంగా లైట్లు, బెంచీల ఏర్పాటు మూడో లైన్ ప్రాజెక్టులో భాగంగా ఇప్పుడున్న బెంచీలకు అదనంగా ప్లాట్ ఫామ్ -1 వద్ద పనులు చేపట్టినట్లు రైల్వే జీఎం తెలిపారు. స్టేషన్ భవనాన్ని ఆధునికీకరించామని, బుకింగ్ కౌంటర్ లో ఎల్ఈడి లైట్, ఒకటో ప్లాట్ ఫార్మ్ వెంట 14 లైట్లు, సీలింగ్ ఫ్యాన్లు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. విజయవాడ-డోర్నకల్ సర్వీస్ కు హాల్ట్ సౌకర్యం ఖమ్మం ఎంపీ రఘురాంరెడ్డి విజ్ఞప్తి మేరకు.. నాగులవంచ రైల్వే స్టేషన్ లో విజయవాడ- డోర్నకల్ ప్యాసింజర్ రైలుకు హాల్ట్ సౌకర్యం కల్పించినట్లు జీఎం తెలిపారు. గత నెల 25వ తేదీ నుంచే ఇది అమలవుతున్నట్లు పేర్కొన్నారు. ఎంపీ రఘురాం రెడ్డికి రైల్వే ప్రయాణికుల కృతజ్ఞతలు



దశాబ్ద కాలంగా నాగులవంచ రైల్వే స్టేషన్ లో అనేక సమస్యలు నెలకొన్నాయని.. ఎంపీ దృష్టికి తీసుకెళ్లగా వెంటనే స్పందించి.. వాటి పరిష్కారానికి కృషి చేశారని నాగులవంచకు చెందిన పలువురు రైల్వే ప్రయాణికులు, నాగులవంచ పరిసర గ్రామాల ప్రజలు, రైతులు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఖమ్మం ఎంపీ రఘురాం రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

# ప్రభుత్వ డిగ్రీ కళాశాల నందు స్టాఫ్ రూమ్ మరియు కంప్యూటర్ రూమ్ ను ప్రారంభించిన పినపాక శాసనసభ్యుడు పాయం వెంకటేశ్వర్లు

**సామాన్యుడి అస్త్రం మణుగూరు** : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు మండలం సమితి సింగారం గ్రామపంచాయతీ పరిధిలో గల ప్రభుత్వ డిగ్రీ కళాశాల నందు 35 లక్షల రూపాయల అంచనా వ్యయంతో నూతనంగా నిర్మించిన స్టాఫ్ రూమ్ మరియు కంప్యూటర్ రూమ్ ను ప్రారంభించిన పినపాక శాసనసభ్యుడు పాయం వెంకటేశ్వర్లు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి పాయం మాట్లాడుతూ 2008 సంవత్సరంలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంలో దివంగత నేత ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి తో ప్రభుత్వ డిగ్రీ కాలేజ్ ఏర్పాటు చేయాలి అని వారి దృష్టికి తీసుకు వెళ్లడంతో నిధులు మంజూరు చేశారని తెలిపారు. పినపాక నియోజకవర్గ ఎమ్మెల్యేగా బాధ్యతలు చేపట్టినప్పటి నుండి ఇప్పటివరకు అంచలంచలుగా డిగ్రీ కళాశాల భవనాలను, వసతులను, రోడ్డు మరియు కళాశాల ప్రాంగణ ప్రహరీ గోడ వంటి పనుల కోసం ప్రభుత్వంతో మాట్లాడి నిధులను మంజూరు చేయించుకోవడం జరిగిందని తెలిపారు. అనుభవజ్ఞులైన బోధన సిబ్బందిని ఏర్పాటు చేయడం జరిగిందని విద్యార్థులకు తెలియపరుస్తూ మంచి క్రమశిక్షణతో విద్యను అభ్యసించి ఉన్నతమైన శిఖరాలకు చేరాలని విద్యార్థులకు తెలిపిన పినపాక శాసనసభ్యుడు పాయం వెంకటేశ్వర్లు. ఈ కార్యక్రమంలో డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్, ఇంచార్జ్ జిఎం డివి రామారావు, ఎస్ఓ టు జిఎం బి. శ్రీనివాస చారి, డీజీఎం ఎస్. రమేష్, ఐటీడీఏ ఈఈ









మధుకర్, డీజీఎం పర్సనల్ జి. శివప్రసాద్, ఎమర్వో నరేష్, ఎంపీడీవో శ్రీనివాస్, ఎంపీఓ వెంకటేశ్వర రావు, డీజీఎం పర్సనల్ ఎకౌంట్స్ అనురాధ, మండల అధ్యక్షుడు పీరినాకి నవీన్, టౌన్ అధ్యక్షుడు శివ సైదులు, శివాలయం చైర్మన్ కూచిపూడి బాబు, మైనారిటీ అధ్యక్షుడు రహీం పాషా, మహిళా అధ్యక్షురాలు కూరపాటి సౌజన్య, మండల ముఖ్య నాయకులు, మహిళా నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# కోర్టు ఆదేశాలు హైడ్రా కూల్చివేతలు



**ఎఫ్‌సీఐ బాధితులకు న్యాయం**

**అస్త్రం, గచ్చిబౌలి** : గచ్చిబౌలిలో అక్రమ నిర్మాణాలు మరోసారి వణికాయి. నెలల తరబడి స్థానికులకు తలనొప్పిగా మారిన ఫెర్టిలైజర్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ఎంప్లాయీస్ కోఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ లేఅవుట్‌లో జరిగిన రోడ్ల ఆక్రమణలపై చివరకు హైడ్రా భారీ చర్యలకు దిగింది. లేఅవుట్‌లోని స్వంత ప్లాట్లను కాపాడుకోవడంలో విఫలమవుతూ రోడ్లు కప్పుకుని, అక్రమంగా నిర్మాణాలు సాగిపోతుండటంతో బాధితులు తీరని నష్టాలు ఎదుర్కొన్నారు. పలుమార్లు అధికారులను కోరినప్పటికీ మార్పు దొరకకపోవడంతో చివరకు హైకోర్టు తలుపులు తట్టారు. హైకోర్టు ఆగ్రహం "అక్రమాలను వెంటనే కూల్చండి" అని స్పష్టమైన ఆదేశాలు సంధ్యా శ్రీధర్ రావు రోడ్లను ఆక్రమించి తమ ప్లాట్లు, తమ హక్కులను హరించారని వ్యథపడ్డ బాధితుల వాంగ్మూలం చూసిన హైకోర్టు గట్టిగా స్పందించింది. అక్రమాలపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన కోర్టు"రోడ్లపై, ప్రజా ప్రయోజనాలపై ఎవరూ రాజ్యమేలరు వెంటనే కూల్చివేతలు చేపట్టాలి" అని హైడ్రాకు స్పష్టమైన దిశానిర్దేశం ఇచ్చింది. హైడ్రా పనితీరు పట్ల సంతృప్తి వ్యక్తం చేసిన న్యాయస్థానం ఎఫ్‌సీఐ లేఅవుట్ బాధితులకు అండగా నిలవాలి అని ప్రత్యేకంగా పేర్కొంది.

**హైకోర్టు ఆదేశాలపై వేగంగా కదిలిన హైడ్రా**

హైకోర్టు ఆదేశాలు వెలువడిన కొద్దిసేపట్లోనే హైడ్రా ఫీల్డ్‌లోకి దిగి చర్యలు ప్రారంభించింది. సోమవారం ఉదయం నుండి భారీ యంత్రాలను తీసుకువచ్చి ఎఫ్‌సీఐ లేఅవుట్‌లో సంధ్యా శ్రీధర్ రావు చేపట్టిన కబ్జాలను వరుసగా కూల్చివేసింది.

ఒక్కో కూల్చివేతతో విలువైన భూములు తిరిగి ప్రజల హక్కులకు చేరాయి. కోట్ల రూపాయల విలువైన భూములను స్వాధీనం చేసుకోవడంతో బాధితుల లేఅవుట్‌కి న్యాయం నిలిచిన రోజు అని స్థానికులు పేర్కొన్నారు.

**"ఎట్టకేలకు న్యాయం జరిగింది" స్థానికుల ఆనందం**

సంవత్సరాలుగా కోర్టు చుట్టూ తిరిగిన ఎఫ్‌సీఐ బాధితులకు ఈ రోజు కొత్త ఆశను నింపింది. "మన గొంతును విన్నది కోర్టు మనకు అండగా నిలిచింది హైడ్రా" అంటూ ఆనందం వ్యక్తం చేశారు. హైడ్రా అధికారులు తీసుకున్న వేగవంతమైన చర్యలకు స్థానికులు అభినందనలు తెలిపారు

## ఏన్కూర్ లో అయ్యప్ప స్వాముల వన సమారాధన



**సామాన్యుడు అస్త్రం వైరా** : కార్తీక మాసం చివరి సోమవారం అయ్యప్ప మాలధారులు వన సమారాధన కార్యక్రమం చేపట్టారు. అయ్యప్ప మాలధారులు వన సమారాధనలో భాగంగా స్థానిక మామిడి తోట నందు శివునికి ప్రత్యేక పూజలు జరిపి భజనలు చేశారు అనంతరం స్వాములు సామూహిక భిక్ష చేశారు. ఈ కార్యక్రమంలో గు రుస్వాములు బండపల్లి బ్రహ్మచారి స్వామి బాలాబత్తుల శివకుమార్ స్వామి దొడ్డ రాజేష్ స్వాముల తో పాటు మణికంఠ స్వాములు తదితరులు పాల్గొన్నారు

## అక్రమ రేషన్ బియ్యం రవాణా పట్టివేత

**బొల్లారం/జ్యోతినగర్** : ప్రభుత్వ రేషన్ బియ్యం అక్రమ రవాణాపై అధికారులు కఠినంగా వ్యవహరించారు. జ్యోతినగర్ ప్రాంతంలో రహస్యంగా తరలిస్తున్న 80 బస్తాల రేషన్ బియ్యం ( సుమారు 37 క్వింటాళ్లు ) ను సివిల్ సప్లై శాఖ సిబ్బంది సోమవారం అడ్డుకున్నారు. డిప్యూటీ తహసీల్దార్ (సివిల్ సప్లై) అనిల్ సూచనల మేరకు ఏర్పాటు చేసిన తనిఖీల్లో బియ్యం తోడు తీసుకెళ్తున్న ఆటోను సీజ్ చేశారు. డ్రైవర్ రాజు, ఆటో యజమాని జైపాల్ ను అదుపులోకి తీసుకున్నారు. తదుపరి విచారణలో ఈ బియ్యం స్థానిక రేషన్ డీలర్ అలివేలమ్మ నుంచి అక్రమంగా సేకరించిందని అధికారులు గుర్తించారు. కార్డుదారులకు ఇవ్వాల్సిన బియ్యాన్ని మార్కెట్‌కు మళ్లించినట్లు ఆధారాలు దొరకడంతో ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. రేషన్ బియ్యం నల్లబజారుకు వెళ్లడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ పేదలకు కేటాయించిన సరుకు దోచుకునే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.




## సమాజంలో వృత్తి ధర్మమే గుర్తింపునిస్తుంది :

**కార్పొరేటర్ రాగం**

**అస్త్రం, శేరిలింగంపల్లి** : వృత్తి ధర్మమే సమాజంలో గుర్తింపునిస్తుందని శేరిలింగంపల్లి డివిజన్ కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ అన్నారు. సోమవారం శేరిలింగంపల్లి డివిజన్ కొండాపూర్ ఎంపీపీఎస్ పాఠశాలలో హెచ్ఎం శేగిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి ఉద్యోగ విరమణ కార్యక్రమంలో కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. అనంతరం ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్ రెడ్డిని ఉపాధ్యాయులతో కలిసి సత్కరించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ మాట్లాడుతూ ప్రధానోపాధ్యాయులు శేగిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి అందించిన సేవలు చిరస్మరణీయంగా గుర్తుండి పోతాయన్నారు. 35 సంవత్సరాలు సుదీర్ఘ కాలంలో వెలకట్టలేని సేవలందించి, ఎలాంటి మచ్చ లేకుండా ఒక క్రమశిక్షణతో ఎంతోమంది విద్యార్థులను ఉన్నత స్థాయికి ఎదిగేలా విద్యార్థులకు మంచి భవిష్యత్తును అందించి జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత దక్కించుకుని ఎలాంటి చెడ్డపేరు లేకుండా కృషి చేసినటువంటి వారికి, వారి కుటుంబ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. వృత్తి ధర్మమే సమాజంలో గుర్తింపునిస్తుందని వారి శేష జీవితం మంచి ఆరోగ్యంతో ఆనందంగా గడపాలని ఆకాంక్షించారు. విద్యార్థులు ఆటపాటలతో అందరిని అలరించారు. ఈ కార్యక్రమంలో పి ఆర్ టి యు టీఎస్ రంగారెడ్డి అధ్యక్షులు శ్యామల మహేందర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి కృష్ణ రెడ్డి, మండల పి ఆర్ టి యు అధ్యక్షులు హనుమంతు, గౌరవ అధ్యక్షులు రాఘవేందర్, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు సుభాష్ చంద్ర రెడ్డి, కొండాపూర్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు రామచంద్రయ్య, ప్రధాన కార్యదర్శి రవీందర్ రెడ్డి, పిఆర్ టి యు నాయకులు శివరాజ్, అనంత్ రెడ్డి, నాగయ్య, పాఠశాల ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



## మంచినీటి మరియు అండర్ గ్రౌండ్ డ్రైనేజీ సమస్యలను పరిష్కరించాలని

**యం సి పి ఐ (యు)నాయకుల వినతి**

**అస్త్రం, మియాపూర్:** ఎంసీపీఐ(యు) మియాపూర్ డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో ముజఫర్ అహమ్మద్ నగర్,(ఎం ఎ నగర్ )లో మంచినీటి సమస్యను పరిష్కరించాలని హఫీజ్ పేట్ గల వాటర్ వర్క్స్ కార్యాలయంలో జనరల్ మేనేజర్ కలిసి వినతి పత్రం ఇవ్వడం జరిగింది.



**యం సి పి ఐ (యు)నాయకులు మాట్లాడుతూ**

మియాపూర్ పరిధిలో గల ముజఫర్ అహ్మద్ నగర్ బస్తీలో వెనుక భాగం లో ఉన్న నాలుగు లైన్లు లో ఉన్న ప్రజలకు సరిగ్గా నీరు అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు అలాగే ముజఫర్ అహ్మద్ నగర్ రోడ్ నెంబర్ -01 లో అండర్ డ్రైనేజ్ లైన్ పూర్తిగా పాడై అలాగే అంబేద్కర్ విగ్రహం ఉన్న రోడ్డులో అండర్ డ్రైనేజ్ లైన్ పూర్తిగా లీకై అయింది. తద్వారా రోడ్డుపైకి మురుగునీరు పొంగిపొర్లుతుంది తద్వారా దుర్వాసనతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు అనారోగ్యాల పాలవుతున్నారు కావున వెనువెంటనే సమస్యను పరిష్కరించాలని వాటర్ వర్క్స్ జి ఎం హాఫీజ్పేట్ కలిసి సమస్యను వివరించడం జరిగింది. వారు స్పందిస్తూ నవంబర్ చివరి తారీకు లోగా తమ సమస్య పరిష్కరిస్తామని హామీ ఇవ్వడం జరిగింది ఈ కార్యక్రమంలో యం సిపిఐ(యు) సీనియర్ నాయకురాలు కుంభం సుకన్య మియాపూర్ డివిజన్ కార్యదర్శి ఇస్లావత్ దశరథ్ నాయక్, సహాయ కార్యదర్శి పల్లె మురళి డివిజన్ కమిటీ సభ్యులు శివాని,ఇందిరా బస్తీ వాసులు తదితరులు పాల్గొన్నారు.




## భీమ్లానాయక్ భామతో బాలకృష్ణ స్టెప్పులు..

# అఖండ 2 నుంచి జాజికాయ సాంగ్ ఆన్ ది వే

టాలీవుడ్ హిట్ కాంబినేషన్స్‌లో టాప్‌లో ఉంటారు బాలకృష్ణ బోయపాటి శీను ఈ ఇద్దరి కలయికలో వస్తోన్న సీక్వెల్ ప్రాజెక్ట్ అఖండ 2 తెలుగుతోపాటు పాన్ ఇండియా ప్రేక్షకులు ఆసక్తికరంగా ఎదురుచూస్తున్న ఈ చిత్రం డిసెంబర్ 5న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల కానుంది. ఈ నేపథ్యంలో ఎస్ థమన్ అండ్ బాలయ్య టీం మ్యూజికల్ ప్రమోషన్స్ షురూ చేసింది. తాజాగా మేకర్స్ అఖండ 2 సెకండ్ సింగిల్ జాజికాయ జాజికాయను నవంబర్ 18న లాంచ్ చేస్తున్నట్టు ప్రకటించారు. వైజాగ్‌లోని జగదాంబ థియేటర్‌లో సాయంత్రం 5 గంటల నుంచి సాంగ్ లాంచ్ ఈవెంట్ జరుగనుంది. ఈ పాటలో భీమ్లానాయక్ ఫేం సంయుక్తామీనన్ బాలకృష్ణతో కలిసి డ్యాన్స్ చేయనుంది. ఈ పాట సినిమాకే హైలెట్‌గా నిలిచిపోయేలా కలర్‌ఫుల్‌గా ఉండబోతున్నట్టు సాంగ్ లుక్ పోస్టర్ క్లారిటీ ఇచ్చేస్తుంది. ఇప్పటికే లాంచ్ చేసిన అఖండ 2 టీజర్ నెట్టింట మిలియన్ల సంఖ్యలో వ్యూస్ రాబడుతూ టాక్ ఆఫ్ ది టౌన్‌గా నిలుస్తోంది. ఇక సీక్వెల్‌లో ఫస్ట్ పార్టుకు మించిన స్కోర్ గూస్ బంప్స్ తెప్పించేలా ఉండబోతుందని ఇప్పటివరకు థమన్ షేర్ చేసిన అప్‌డేట్స్ చెబుతున్నాయి. అఖండ 2ను 14 రీల్స్ ప్లస్ పతాకంపై రామ్ ఆచంట, గోపీచంద్ ఆచంట సంయుక్తంగా నిర్మిస్తున్నారు.

# ఘట్టమనేని వారసుడి ఫస్ట్ సినిమా.. హీరోయిన్‌ను ప్రకటించిన మేకర్స్




ఘట్టమనేని వారసుడు జయకృష్ణ ( ఘట్టమనేని రమేశ్‌బాబు తనయుడు)కు జోడీగా బాలీవుడ్ హీరోయిన్ రవీనా టాండన్ కుమార్తె రాషా టాండానీ నటిస్తున్నట్లు అధికారికంగా ప్రకటించారు. 'ఆర్ఎక్స్ 100, మంగళవారం' చిత్రాల దర్శకుడు అజయ్ భూపతి ఈ ప్రాజెక్ట్ గురించి కొద్దిరోజుల క్రితమే ప్రకటించిన విషయం తెలిసిందే. అయితే, తాజాగా హీరోయిన్ పోస్టర్‌ను ఆయన షేర్ చేశారు. ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్‌ను వైజయంతి మూవీస్‌తో అశ్విని దత్ సమర్పిస్తున్నారు. చందమామ కథలు బ్యానర్‌పై పి. కిరణ్ నిర్మిస్తున్నారు. బాలీవుడ్‌లో అజయ్ దేవగన్ చిత్రం 'అజాద్'లో ఓ కీలకపాత్రలో నటించి, మెప్పించిన రాషా టాండన్ ఇప్పుడు టాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇస్తుంది. త్వరలో షూటింగ్ ప్రారంభం కానుంది. ఎమోషనల్ లవ్ స్టోరీతో అజయ్ భూపతి ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తోంది. జయకృష్ణ, రషా టాండన్ కాంబినేషన్ వెండితెరపై ఎలా ఉంటుందో చూడాలంటే కొంత కాలం ఆగాల్సిందే.

## ఆకట్టుకునేలా 'దండోరా' టీజర్

రీసెంట్ టైంలో తెలంగాణ బ్యాక్ డ్రాప్ స్టోరీతో చాలా సినిమాలు వస్తున్నాయి. అలాంటి మరో మూవీ 'దండోరా'. శివాజీ, బిందుమాధవి, నవదీప్, రవికృష్ణ, నందు తదితరులు కీలక పాత్రలు పోషించిన ఈ చిత్రం.. డిసెంబరు 25న థియేటర్లలోకి రానుంది. ఇప్పటినుంచే ప్రమోషన్ మొదలుపెట్టేశారు. అడివి శేష్ చేతుల మీదుగా ఇప్పుడు టీజర్ రిలీజ్ చేశారు. తెలంగాణలోని ఓ పల్లెలో ఒకరు చనిపోతారు. తర్వాత ఎలాంటి పరిస్థితులు ఎదురయ్యాయి? చివరకు ఏమైందనేదే స్టోరీలా అనిపిస్తుంది. గతంలో ఇలానే చావు చుట్టూ జరిగే కథతో 'బలగం' తీశారు. అది ఓవైపు కామెడీగా సాగుతూనే చివరలో ఎమోషనల్ చేసింది. 'దండోరా' మాత్రం సీరియస్ డ్రామాలా అనిపిస్తుంది. అలానే ఇందులో ప్రేమకథ, వేశ్య స్టోరీ, సర్పంచ్ స్టోరీ లాంటి ఉపకథలు కూడా కనిపించాయి.



## జనవరి 7 నుంచి నాలుగో సీజన్..

# ఈ రెండు నగరాల్లోనే మ్యాచ్‌లు!

మహిళల క్రికెట్‌ను కొత్త పుంతలు తొక్కించిన మహిళల ప్రీమియర్ లీగ్ మరో ఎడిషన్‌కు సిద్ధమవుతోంది. మూడు సీజన్లుగా అభిమానులను స్టేడియాలకు రప్పించిన ఈ మెగా టోర్నీ నాలుగో సీజన్ జనవరిలోనే ప్రారంభం కానుంది. ఐదు ఫ్రాంచైజీలు రీటెన్షన్ జాబితాను సమర్పించడంతో వేలానికి సన్నాహకాలు చేస్తున్న నిర్వాహకలు.. టోర్నీ తేదీలను కూడా ఖరారు చేసే పనిలో ఉన్నారు. క్రిక్‌బజ్ కథనం ప్రకారం జనవరి 7 నుంచి ఫిబ్రవరి 3 వరకూ నాలుగో సీజన్ జరుగనుందని సమాచారం. వచ్చే ఏడాది భారత్, శ్రీలంక సంయుకంగా పురుషుల టీ20 వరల్డ్‌కప్ పోటీలకు ఆతిథ్యమిస్తున్నాయి. ఫిబ్రవరి మొదటి వారంలోనే ప్రపంచకప్ జరుగనున్న నేపథ్యంలో డబ్ల్యూపీఎల్ షెడ్యూల్‌ను ముందుకు జరిపారు నిర్వాహకులు. అందుకే.. ఫిబ్రవరిలో ప్రారంభం కావాల్సిన టోర్నీ ఈసారి జనవరిలోనే షురూ కానుంది. అంతేకాదు మూడో సీజన్ మాదిరిగా కాకుండా డబ్ల్యూపీఎల్ నాలుగో సీజన్ మ్యాచ్‌లను రెండు నగరాల్లో నిర్వహించే అవకాశముంది. రెండు విడతలుగా సాగే ఈ మెగా ఈవెంట్‌కు ముంబై, బరోడాలను వేదికలుగా ఎంపిక చేసినట్టు విశ్వసనీయ వర్గాలు చెబుతున్నాయి. తొలిదశ మ్యాచ్‌లు నవీ ముంబైలోని డీవై పాటిల్ స్టేడియంలో.. రెండో దశ మ్యాచ్‌లు బరోడాలోని కోటంబి మైదానంలో డబ్ల్యూపీఎల్ మ్యాచ్‌లు ఆడించనున్నారు. జనవరి 16 నుంచి.. ఫిబ్రవరి 3న ఫైనల్ వరకూ బరోడానే వేదిక కానుందని టాక్. అయితే.. టోర్నీ ఆరంభ తేదీ, వేదికలపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.



### మంధానకు రికార్డు ధర

మహిళల ప్రీమియర్ లీగ్ నాలుగో సీజన్ కోసం భారత క్రికెటర్లను ఫ్రాంచైజీలు భారీ ధరకు రీటైన్ చేసుకున్నాయి. విశ్వవిజేతగా అవతరించిన టీమిండియాలోని సభ్యులైన స్మృతి మంధాన జెమీమా రోడ్రిగ్స్ రీచా ఘోష్ ల బ్యాండు వాల్యూ పెరగడమే కాదు రీటైన్ ధర కూడా కోట్లకు చేరింది. స్వదేశంలో ముగిసిన వరల్డ్ కప్‌లో చెలరేగి ఆడిన మంధానను రూ.3.50 కోట్ల రికార్డు ధరకు ఆర్సీబీ రీటైన్ చేసుకుంది. వరల్డ్ కప్‌లో ప్లేయర్ ఆఫ్ ది టోర్నమెంట్‌గా ఎంపికైన దీప్తి శర్మ ను యూపీ వారియర్స్ వదిలేసింది. డబ్ల్యూపీఎల్ నాలుగో సీజన్ వేలంలో ఫ్రాంచైజీలు రూ.15 కోట్లు ఖర్చు చేయనున్నాయి. స్లాబ్స్ విషయానికొస్తే.. ఒక క్రికెటర్‌కు మాత్రమే రూ.3.5 కోట్లు చెల్లించే అవకాశముంది. రెండో ప్లేయర్‌కు రూ.2.5 కోట్లు, మూడో ప్లేయర్‌కు రూ.1.75కోట్లు, నాలుగో బ్యాటర్‌కు రూ.1 కోటి.. ఐదుగురు ప్లేయర్లకు రూ.50 లక్షలు వేలం పాట పాడాల్సి ఉంటుంది. ఒక ఫ్రాంచైజీ ఐదుగురిని అట్టిపెట్టుకుంటే వాళ్ల పర్స్ నుంచి రూ.9.75 ను తొలగిస్తారు. ఒకవేళ నలుగురిని రీటైన్ చేసుకుంటే.. రూ.8.75 కోట్లు.. ముగ్గురికి రూ.7.75 కోట్లు, ఇద్దరిని రీటైన్ చేసుకుంటే రూ.6 కోట్లు కట్ చేస్తారు.

**ముంబై ఇండియన్స్ :** నాట్ సీవర్ బ్రంట్ (రూ.3.5 కోట్లు), హర్మన్‌ప్రీత్ కౌర్ (రూ.2.5 కోట్లు), హేలీ మాథ్యూస్ (రూ.1.7కోట్లు), అమన్‌జోత్ కౌర్(రూ.1.0కోట్లు), జి. కమలిని(రూ.50 లక్షలు). ప్రస్తుతం ముంబై పర్స్‌లో 5.75 కోట్లు ఉన్నాయంతే.

ఢిల్లీ క్యాపిటల్స్ : జెమీమా రోడ్రిగ్స్,(రూ.2.2 కోట్లు) షఫాలీ వర్మ(రూ.2.2 కోట్లు), మరినే కాప్(రూ.2.2 కోట్లు), అనాబెల్ సథర్‌లాండ్(రూ.2.2 కోట్లు), నిక్కీ ప్రసాద్ అన్‌క్యాప్డ్(రూ.50 లక్షలు). ఢిల్లీ పర్స్‌లో రూ.6.75 కోట్లు ఉన్నాయి.

యూపీ వారియర్స్ : శ్వేతా షెరావత్ (రూ.50 లక్షలు). పర్స్‌లో 14.5 కోట్లు ఉన్నాయి.


ఆర్సీబీ : స్మృతి మంధాన(రూ.3.5 కోట్లు), రీచా ఘోష్ (రూ.2.75కోట్లు), ఎలీసా పెర్రీ(రూ.2 కోట్లు), శ్రేయాంక పాటిల్(రూ.60లక్షలు)లను మాత్రమే రీటైన్ చేసుకుంది. పర్స్‌లో 6.15 కోట్లు ఉన్నాయి.




## స్పోర్ట్స్

### రాజస్థాన్ హెడ్‌కోచ్‌గా మళ్లీ అతడే..

### కెప్టెన్సీ ఎవరికి అప్పగిస్తాడో..!



ఐపీఎల్ పద్దెనిమిదో సీజన్‌లో దారుణ ప్రదర్శన.. ఆపై హెడ్‌కోచ్ రాహుల్ ద్రవిడ్ రాజీనామాతో షాక్ తిన్న రాజస్థాన్ రాయల్స్ కొత్త కోచ్‌ను ఖరారు చేసింది. గతంలో మూడు సీజన్లు సేవలందించిన కుమార సంగక్కరకు ప్రధాన కోచ్‌గా నియమించింది. ద్రవిడ్ వైదొలిగినప్పటి నుంచి తదుపరి కోచ్‌గా ఈ శ్రీలంక లెజెండ్ వేరు వినించింది. ఊహించినట్టే సోమవారం అతడిని కోచ్‌గా తీసుకుంది రాజస్థాన్. డైరెక్టర్ ఆఫ్ క్రికెట్‌గా.. కోచ్‌గా రెండు బాధ్యతల్ని సంగక్కరకే అప్పగించింది రాజస్థాన్ యాజమాన్యం. రాజస్థాన్‌తో సంగక్కరకు మంచి అనుబంధముంది. 2021లో ప్రధాన కోచ్‌గా బాధ్యతలు చేపట్టిన అతడు.. 2024 వరకూ కొనసాగాడు. సంగక్కర నేతృత్వంలో మెరుగైన ప్రదర్శన చేసిన రాజస్థాన్ 2022 ఫైనల్ ఆడింది. ఆ తర్వాత పదిహేడో సీజన్‌లో ప్లే ఆఫ్స్ చేరింది. దాంతో.. మళ్లీ అతడినే కోచ్‌గా నియమించాలని రాజస్థాన్ యాజమాన్యం భావించింది. ఇదే విషయాన్ని రాజస్థాన్ యజమాని మనోజ్ బడలే ఫ్రాంచైజీ ఎక్స్ పోస్ట్‌లో తెలిపాడు. 'పద్దెనిమిదో సీజన్లో రాజస్థాన్ పేలవ ప్రదర్శన దృష్ట్యా.. జట్టును గాడీలో పెట్టగల కోచ్ అవసరం. స్క్వాడ్ గురించి అవగాహన ఉన్న సంగక్కరనే కోచ్‌గా తీసుకోవాలనుకున్నాం. నాయకత్వ లక్షణాలే కాదు రాజస్థాన్ ఫ్రాంచైజీ సంస్కృతి గురించి బాగా తెలిసిన అతడే జట్టును మునపటిలా నడిపించగలడు. నాయకుడిగా అతడిపై మాకు సంపూర్ణ మద్దతు ఉంది. అతడి ప్రశాంతత, అతడికి ఉన్న స్పష్టత, క్రికెట్ పరిజ్ఞానం రాజస్థాన్‌ను ఎంతో ఉపయోగపడుతాయి' అని రాజస్థాన్ యజమాని మనోజ్ బడలే వెల్లడించాడు.

### కెప్టెన్ ఎవరు?

హెడ్‌కోచ్‌గా మళ్లీ వస్తున్న సంగక్కరకు తొలి సవాల్ కెప్టెన్ ఎంపికతో మొదలవ్వనుంది. నాలుగేళ్లు జట్టును నడిపించిన సంజూ శాంసన్ ఫ్రాంచైజీని వీడడంతో కాబోయే సారథి ఎవరు? అనేది అభిమానుల్లో ఆసక్తి రేపుతోంది. ఓపెనర్, పవర్ హిట్టర్ అయిన సంజూను ట్రేడ్ డీల్ ద్వారా చెన్నై సూపర్ కింగ్స్‌కు అమ్మేసి రవీంద్ర జడేజా ను కొన్న రాజస్థాన్.. ఎవరికి కెప్టెన్సీ ఇస్తుంది? అనేది తెలియాల్సి ఉంది. జడ్డూకు పగ్గాలు అప్పగిస్తారా? లేదా అట్టిపెట్టుకున్న వాళ్లలోని ఒకరికి ఓటేస్తారా అనేది చర్చనీయాంశంగా మారింది. 18వ సీజన్‌లో సంజూ గైర్హాహజరీలో రియాన్ పరాగ్ ఆకట్టుకున్నాడు. దాంతో.. అతడివైపు యాజమాన్యం, కోచ్ సంగక్కర మొగ్గు చూపే అవకాశాలు లేకపోలేదు. అయితే.. కెప్టెన్సీ రేసులో యశస్వీ జైస్వాల్, ధ్రువ్ జురెల్ పేర్లు కూడా వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో సంగక్కర ఎవరిని కెప్టెన్‌గా సిఫారసు చేస్తాడో చూడాలి. రాజస్థాన్ కోచింగ్ సిబ్బంది విషయానికొస్తే.. టీమిండియా మాజీ కోచ్ విక్రమ్ రాథోడ్ అసిస్టెంట్ కోచ్‌గా కొనసాగనున్నాడు. బౌలింగ్ కోచ్‌గా షేన్ బాండ్ సేవల్ని యాజమాన్యం ఉపయోగించుకోనుంది. అలానే సంగక్కర హయాంలో సపోర్టింగ్ స్టాఫ్‌గా ఉన్న ట్రెవర్ పెన్నీ, సిద్ధార్థ లహిరి తిరిగి జట్టుతో కలిసే అవకాశముంది. క్రిక్‌బజ్ కథనం ప్రకారం పద్దెనిమిదో సీజన్‌లో రాజస్థాన్ రాయల్స్ జట్టు ప్రదర్శన పట్ల ఫ్రాంచైజీ అసంతృప్తితో ఉంది.

PRINTED AND PUBLISHED BY PANUTULA PRIYANKA, ON BEHALF OF PANUTULA PRIYANKA, PRINTED AT M/S.PARAHUSHAR PRINTING PUBLICATION, 1-4-36, SRINAGAR COLONY, MAHABUBABAD, WARANGAL TELANGANA -506101.AND PUBLISHED AT #H.NO.12-155, RAVINDER REDDY COMPLEX, NEAR HANUMANTEMPLE, IDA BOLLARAM MUNICIPALITY, JINNARAM MANDAL, SANGAREDDY DIST - 502325, TELANGANA STATE. EDITOR: PANUTULA PRIYANKA. RNI NO: TGTEL/25/A1872, Email: mathrubhoomiceo@gmail.com, Phone: 9182698313.